ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 7 ఆగస్టు 2024

స్విమ్స్ డైరెక్టర్ ఎవరు?



టీటీడీ నిర్వహణలో ఉన్న శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (స్విమ్స్) డైరెక్టర్‌గా ఎవరు రాబోతున్నారు అనే చర్చ వైద్య వర్గాల్లో జోరుగా సాగుతోంది. ప్రస్తుత డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ పదవీకాలం రెండేళ్లపాటు ఉన్నప్పటికీ ప్రభుత్వం మారడంతో ఈయన స్థానంలో కొత్తవారికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. రాజకీయ నాయకులతో సఖ్యతగా ఉండే రవికుమార్, టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు ప్రభుత్వం మారగానే మొదలుపెట్టారని అంటున్నారు. నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో కార్డియోథొరాసిక్ సర్జన్‌గా పనిచేస్తున్న ఆర్వీ కుమార్‌ను వైసీపీ ప్రభుత్వంలో స్విమ్స్ డీమ్డ్ వర్సిటీ వైస్ చాన్సలర్ కమ్ డైరెక్టర్‌గా ప్రతిష్ఠాత్మకమైన బాధ్యతలు అప్పగించారు. స్విమ్స్‌లో ఉన్న సీనియర్లను పట్టించుకోకుండా ఈయన్ను తీసుకురావడంపై అప్పట్లో వైద్యవర్గాల్లో చర్చ జరిగింది కూడా. అయితే వైసీపీ నాయకులకు ఆగమేఘాల మీద వైద్య సేవలు ఇంటికే అందిస్తూ ఈయన వారి మెప్పు పొందారు. నిజానికి గుండె వైద్య నిపుణుడిగా స్విమ్స్‌లో పేరున్న సీనియర్ డాక్టర్ రాజశేఖర్‌కు వెంగమ్మ తర్వాత డైరెక్టర్ పదవి లభిస్తుందని అందరూ భావించారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి బాగా సన్నిహితుడిగా కూడా పేరున్నందున ఈయనకు పదవి లభిస్తుందని అనుకున్నా అప్పటి సీఎం జగన్ పేషీ నుంచి రవికుమార్ పేరు అనూహ్యంగా తెరమీదకు వచ్చింది. ఇప్పుడు మళ్లీ డాక్టర్ రాజశేఖర్ పేరు వినిపిస్తోంది. బర్డ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ పేరు కూడా బలంగానే వినిపిస్తోంది. అయితే ఆయన వయసు రీత్యా సాధ్యం కాదేమో అనే అనుమానాలూ ఉన్నాయి. మరోవైపు మాజీ డైరెక్టర్ వెంగమ్మ పేరు కూడా ప్రస్తావనకు వస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో అత్యంత అవమానకర రీతిలో ఆమెను పంపేసినందున కూటమి ప్రభుత్వం ఆమె పేరును సానుకూలంగా పరిశీలించవచ్చని కొందరు అంటున్నారు.

ఐఏఎస్‌ను నియమిస్తారా?

ఇలా వుంటే స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద ఆస్పత్రులను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి.. ఒక డైరెక్టర్‌ను ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదన ఎప్పటినుంచో ఉంది. ఒకవేళ ఈ అంశం తెరపైకి వస్తే ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించే అవకాశాలూ లేకపోలేదు. ఏదిఏమైనా టీటీడీ పాలకమండలి నియామకం జరిగిన తర్వాతే స్విమ్స్ డైరెక్టర్ మార్పులు జరిగే అవకాశం ఉంటుందని అంటున్నారు. రాయలసీమకే తలమానికం అయిన స్విమ్స్ సారథ్య బాధ్యతలను రాజకీయ కోణంలోంచి చూసి కాకుండా ప్రతిభావంతులకు అప్పగిస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. పేదలకూ మంచి వైద్యం అందుతుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అర్ధరాత్రి దీపాల పేరుతో మోసాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 6: ముక్కంటి ఆలయ పరిసరాల్లో అర్ధరాత్రి వేళ కొందరు దళారీలు దీపాల పేరుతో భక్తులను భారీగా మోసం చేస్తున్నారు. ఆలయం పరిసరాల్లోని 1వ గేటు, 2వ గేటు సమీపంలో భక్తులు రాత్రి వేళ నిద్రిస్తుంటారు. ఉదయం వీరికి కొందరు దీపాలు వెలిగిస్తే దోషం పోతుందంటూ నమ్మిస్తారు. అలా నకిలీ నేతి దీపాలను భక్తులకు అంటగడుతూ చాలా ఏళ్లగా దందాలు సాగిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఉదయం వేళ భక్తులను మోసగించే ప్రక్రియకు స్వస్తి పలికారు. అయితే గుట్టు చప్పుడు కాకుండా అర్ధరాత్రి పాపాల దీపాలను విక్రయిస్తున్నారు. రాత్రి ఒంటి గంట నుంచి 1వ గేటు, 2వ గేటు సమీపంలోని భక్తులను కొందరు దళారీలు హడావుడిగా నిద్ర లేపేస్తున్నారు. అక్కడికి సమీపంలోని కాశీ విశ్వనాథస్వామి సన్నిధి, వీరభద్రస్వామి సన్నిధి, వాయుమూల గణపతి వద్ద ప్రతి ఒక్క భక్తుడూ వేర్వేరుగా మూడు దీపాలు వెలిగించాలంటూ నమ్మిస్తున్నారు. ఒక్కో దీపానికి రూ.500 చొప్పున ఒక్కో భక్తుడి నుంచి రూ.1,500 వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. భక్తులను మోసగించే ఈ తరహా దొంగలు ఉదయం ఐదు గంటల్లోగా ఈ దందాను ముగిస్తున్నారు. అర్ధరాత్రి ఆలయంలో దోషం పేరుతో ఇలా భక్తులను దోపిడీ చేయడం సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్‌గా మారింది.




అర్ధరాత్రి భక్తులు వెలిగించిన దీపాలు

తిరుమలలో భారీ వర్షం

తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం రాత్రి 10 నుంచి 11.30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ఎక్కువగా ఉన్నప్పటికీ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి నల్లటి మేఘాలు తిరుమలను కప్పేయడం మొదలుపెట్టాయి. మూడు గంటల సమయంలో మొదలైన వాన గంటపాటు జోరుగా కురిసింది. ఆతర్వాత చిరుజల్లులు రాత్రి వరకు కొనసాగాయి. రాత్రి పది నుంచి గంటన్నరపాటు భారీ వాన కురవడంతో శ్రీవారి ఆలయ ప్రాంతంతోపాటు, మాడవీధులు, కాటేజీలు, పార్కులు, రోడ్లు తడిచిముద్దయ్యాయి. ఎత్తుప్రదేశాల నుంచి వర్షం జోరుగా ప్రవహించింది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు ఇబ్బందిపడ్డారు. ఘాట్లలో వాహనదారులూ ఇబ్బంది పడాల్సి వచ్చింది.



చిన్నారుల అవస్థ





నిమ్మకాయల వీధిలో..



చేపల మార్కెట్ వద్ద..

తిరుపతిలో కుండపోత

తిరుపతి అర్బన్, ఆగస్టు 6: తిరుపతిలో మంగళవారం కుండపోత వర్షం కురిసింది. పగలంతా అధిక ఉష్ణోగ్రతలు నమోదైనా సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై దాదాపు అరగంటపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రోడ్లన్నీ చెరువులను తలపించాయి. కాలువల్లోని మురుగు కూడా కలవడంతో జనం తీవ్ర ఇబ్బంది పడ్డారు. విద్యార్థులు ఇళ్లకే వెళ్లే సమయం కావడంతో తడిచి ముద్దయ్యారు.



సూళ్లూరుపేట జీఎన్‌టీ రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

సూళ్లూరు పేట, తడలో వీధులన్నీ జలమయం

సూళ్లూరుపేట/తడ, ఆగస్టు 6: సూళ్లూరుపేట, తడలోనూ మంగళవారం భారీ వర్షం కురిసింది. వీధులన్నీ జలమయం అయ్యాయి.



వర్షం కారణంగా శ్రీవారి ఆలయం ముందు ఇబ్బంది పడుతున్న భక్తులు



గోవిందా.. గోవిందా..!

తిరుమలలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి శ్రీవారి ఆలయం ముందు కొంత ప్రదేశం వరకు నెయ్యితో కూడిన మురుగు పొంగింది. దర్శనానంతరం ఆలయం బయటకు వచ్చేవారు, ప్రసాదాలు తీసుకొచ్చే భక్తులు దీనిపై కాలు వేయడంతో జారిపడి గాయపడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



చంద్రగిరిలో ఇసుక రీచ్‌ల కోసం పరిశీలన

చంద్రగిరి, ఆగస్టు 6: చంద్రగిరి మండలంలో ఇసుక రీచ్‌ల కోసం రెవెన్యూ, ఎంపీడీవో, మైనింగ్, ఎస్ఈబీ, ఆర్‌డబ్ల్యూ అధికారులు మంగళవారం స్వర్ణముఖి నదిని పరిశీలించారు. మండలంలోని శానంబట్ల, నాగయ్యగారిపల్లె వద్ద ఇసుక రీచ్‌లు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై వివరాలను సేకరించారు. శానంబట్ల వద్ద రీచ్ ఏర్పాటు చేయడానికి అనువుగా లేదని గుర్తించినట్లు తెలిసింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు సమాచారం. ఈకార్యక్రమంలో మైన్స్ ఏడీ ప్రకాష్‌కుమార్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో వెంకటసూర్యసాయి, ఎస్ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి, ఎంవీఐ మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



శానంబట్ల వద్ద స్వర్ణముఖినదిలో ఇసుక రీచ్ కోసం పరిశీలిస్తున్న అధికారులు

కోర్టు కానిస్టేబుళ్లకు త్వరలో శిక్షణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 6: కొన్ని నేరాల్లో నేరస్తులకు శిక్ష పడేలా ఎలా పని చేయాలి? దర్యాప్తు అధికారుల సహాయ సహకారాలు ఎలా తీసుకోవాలి? ఏపీపీలతో ఎలా వ్యవహరించాలి? అనే విషయాలపై కోర్టు కానిస్టేబుళ్లకు పోలీస్ శాఖ ఉన్నతాధికారులు త్వరలో అవగాహన కల్పించనున్నారు. ఈ విషయంలో న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అనుభవజ్ఞులైన అధికారులు, న్యాయ కోవిదులతో శిక్షణ ఇప్పించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు ఎన్ని కేసుల్లో శిక్ష పడింది..? ప్రధానంగా పోక్సో కేసుల్లో దర్యాప్తు ఎలా చేయాలి? అనే అంశాలపై సమగ్రంగా శిక్షణ ఇప్పించనున్నారు. దీనికోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

చిరుత పులా.. రేసు కుక్కలా?

- అడవి జంతువు దాడిలో దూడ మృతి
- పాదముద్రలు సేకరించిన అటవీ అధికారులు





పాదముద్రలను సేకరిస్తున్న అటవీ అధికారులు (ఇన్‌సెట్‌లో) దూడ కళేబరం

రామచంద్రాపురం, ఆగస్టు 6: అడవి జంతువు ఓ దూడను చంపి తిన్న సంఘటన రామచంద్రాపురం మండలం పరమాల అటవీ ప్రాంత సమీపంలోని పొలాల వద్ద సోమవారం రాత్రి జరిగింది. పరమాలకు చెందిన శేషమ్మ సోమవారం సాయంత్రం అటవీ ప్రాంత సమీపంలోని తమ పొలం వద్ద రెండు ఆవులతోపాటు ఓ దూడను కట్టి ఇంటికి వచ్చింది. మంగళవారం ఉదయం ఆవు పాలు తీయడానికి పొలం వద్దకు వెళ్లగా.. దూడను గుర్తు తెలియని అడవి జంతువు చంపి సగం తిన్నట్లు గుర్తించింది. గ్రామస్తులకు తెలపగా వారు అటవీశాఖ అధికారి కిషోర్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అడవి జంతువు పాదముద్రలు సేకరించి ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఆ నివేదిక వస్తే గానీ ఏ జంతువు దూడను చంపిందో గుర్తించలేమన్నారు. ఎన్నో ఏళ్లగా తమ పొలాల వద్ద పశువులను కట్టేస్తున్నప్పటికీ ఇలాంటి ఘటన ఇంతకు మునుపు జరగకపోవడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. దూడను చంపింది చిరుత పులా, రేసు కుక్కలా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

విద్యుత్ వాహనాలకే ప్రాధాన్యం

- శ్రీవారి భక్తులకు సురక్షిత ప్రయాణం అందించడమే లక్ష్యంగా పనిచేయండి
- ఆర్టీసీ అధికారులతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



నూతన బస్సును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాబోయే కాలంలో విద్యుత్ వాహనాలకే ప్రాధాన్యం ఉంటుందని రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శ్రీవారి దర్శనానంతరం తిరుమలలోని ఆర్టీసీ బస్టాండ్‌ను జిల్లా ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి, డీఎం విశ్వనాథ్‌తో కలిసి పరిశీలించారు. ముందుగా డీఎం కార్యాలయానికి వెళ్లి అధికారులు, ఉద్యోగులతో మాట్లాడారు. శ్రీవారి భక్తులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా పని చేయాలని చెప్పారు. బస్టాండును పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భక్తులతో మర్యాదపూర్వంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతమున్న బస్టాండు సరిపోతుందా అని ప్రశ్నించగా, విద్యుత్ బస్సుల కోసం ఓ ప్రదేశాన్ని ఇవ్వాలని టీటీడీని కోరామని, త్వరలోనే వారు అందజేస్తారని అధికారులు వివరించారు. ఈక్రమంలో కొందరు ఉద్యోగులు ప్రమోషన్లపై ప్రస్తావించగా, మంత్రి పరిశీలిస్తామన్నారు. తర్వాత ఓ విద్యుత్ బస్సులోకి వెళ్లి భక్తులతో ముచ్చటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లలో ఆర్టీసీకి బస్సు కొనాల్సి వచ్చే విద్యుత్ బస్సునే కొనేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోనున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించేనాటికి ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గత ప్రభుత్వం చాలా రూట్లను మూసివేసిందని, నూతన బస్సుల కొనుగోళ్లలోనూ లోపాలను గుర్తించినట్లు చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం మాత్రం ఆర్టీసీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తిరుమల, తిరుపతి మధ్య రోజూ 300 ట్రిప్పుల ద్వారా 90వేల మంది భక్తులు రాకపోకలు సాగించడం గొప్పవిషయమన్నారు.

రెండు నూతన బస్సులను ప్రారంభించిన మంత్రి

తిరుపతి(ఆర్టీసీ): వెంకటగిరి డిపోకు చెందిన రెండు నూతన బస్సులను అలిపిరి డిపోలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. వెంకటగిరిలో ఈ సర్వీసు ప్రతి రోజూ ఉదయం 8.15గంటలకు బయల్దేరి తిరుపతికి 9.30గంటలకు చేరుకుంటుంది. 10.15గంటలకు తిరుపతి నుంచి బయల్దేరి రాత్రి 7.40 గంటలకు విజయవాడకు చేరుకుంటుంది. మరుసటి రోజున ఉదయం ఆరు గంటలకు విజయవాడలో బయల్దేరి మధ్యాహ్నం 3.45గంటలకు తిరుపతికి చేరుకుని సాయంత్రం 5.15గంటలకు వెంకటగిరికి చేరుకుంటుంది. ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈ నరసింహులు, సీటీఎం భాస్కర్‌రెడ్డి, డీఎంలు విశ్వనాథం, బాలాజి, రామకృష్ణ, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలుత మంత్రి అలిపిరి డిపో ఆవరణంలో మొక్క నాటారు.



విద్యుత్ బస్సులోని భక్తులతో మాట్లాడుతున్న మంత్రి

కుంభాభిషేక మహోత్సవాలపై ఎమ్మెల్యే సమీక్ష



ఉత్సవాలపై అధికారులతో మాట్లాడుతున్న పులివర్తి నాని

చంద్రగిరి, ఆగస్టు 6: చంద్రగిరిలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ శిఖర ప్రతిష్ఠ, శత చండీ సహిత, సహస్ర కలశ కుంభాభిషేక మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని పిలుపునిచ్చారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు వైభవంగా నిర్వహించనున్న ఈ ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే పరిశీలించి, సంబంధిత అధికారులతో సమీక్షించారు. కుంభాభిషేక ఉత్సవాలకు చేపట్టాల్సిన వివిధ పనులపై దిశా నిర్దేశం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పార్టీలకతీతంగా ఉత్సవాలు చేపడతామన్నారు. అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం విరాళాలు ఇచ్చిన వారందరికీ కూడా ఆహ్వానాలు అందించాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి, పూజారి, నూతన, మాజీ కమిటీ సభ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



స్నేహారెడ్డి, అర్హ - అల్లు అయాన్

తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, తమిళనాడు మంత్రి రామచంద్రన్, హీరో అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి, కుమారుడు అయాన్, కుమార్తె అర్హ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.72 కోట్లు

తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.72 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 63,095 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 23,127 మంది తలనీలాలు సమర్పించారు.

లడ్డూ ముడిసరుకుల పరిశీలన

తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని లడ్డూ కాంప్లెక్స్‌ను టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి మంగళవారం పరిశీలించారు. పోటో పేష్కార్ శ్రీనివాసులుతో కలిసి ఆయన లడ్డూ కాంప్లెక్స్‌లోని కౌంటర్లను సందర్శించారు. దర్శన టికెట్లను ఎలా స్కాన్ చేస్తున్నారు, వాటికి లడ్డూలు ఎలా ఇస్తున్నారనే అంశాలను పరిశీలించారు. లడ్డూల బరువు ఎలా ఉంది, లడ్డూలను తీసుకెళ్లేందుకు భక్తులు వినియోగించే కవర్లను కూడా పరిశీలించారు. అనంతరం లడ్డూల ప్రసాదాల తయారీకి వినియోగించే ముడిసరుకుల నిల్వ ఉంచే ఉగ్రాణంకు వెళ్లారు. అక్కడ ముడిసరుకులను పరిశీలించి వాటిని సరఫరా చేస్తున్న కాంట్రాక్ట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ఎలా ఉందనే అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో వీఎస్వో నందకిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుమలలో నేడు పురుశైవారి తోటోత్సవం

తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం శాత్తుమొరను పురస్కరించుకుని బుధవారం తిరుమలలో పురుశైవారి తోటోత్సవం జరుగనుంది. పురాణాల ప్రకారం పాండ్య దేశంలో పరమ విష్ణుభక్తుడైన విష్ణుచిత్తుడికి చెందిన తులసీవనంలో ఆషాడ శుక్ల చతుర్థి నాడు పూర్వఫల్గుణీ నక్షత్రంలో భూదేవి అంశగా ఆండాల్(గోదాదేవి) అమ్మవారు ఆవిర్భవించారు. ఈ పవిత్రమైన రోజున సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని పురుశైవారితోటకు వేంచేపు చేస్తారు. అక్కడ నివేదనల అనంతరం స్వామి, అమ్మవార్లు బయల్దేరి పొగడ చెట్టు వద్దకు రాగానే హారతి ఇస్తారు. హారతి, పుష్పమాల, శఠారి పొగడ చెట్టుకు సమర్పిస్తారు. శఠారికి అభిషేకం అనంతరం తిరిగి తిరుచ్చిపై ఉంచుతారు. అక్కడ నుంచి స్వామి, అమ్మవార్లు మాడవీధుల గుండా ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకుంటారు.

12, 13 తేదీల్లో సెల్‌ఫోన్లు, వాచీల వేలం

తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన సెల్‌ఫోన్లు, వాచీలను టీటీడీ ఈ నెల 12, 13వ తేదీల్లో టెండర్ కం వేలం (ఆఫ్‌లైన్) ద్వారా వేలం వేయనున్నారు. ఇందులో ఉపయోగించినవి, పాక్షికంగా దెబ్బతిన్న సెల్‌ఫోన్లు 22 లాట్లు ఉంచనున్నారు. మైక్రోసాఫ్ట్, ఆసస్, జీఓణి, హువై, ఎల్జీ, మోటోరోలా, సోనీ, రెడ్‌మీ, ఎంఐ, ఐటెల్, లేనోవా, రియల్‌మీ, పోకో, ఆనర్, మైక్రోమాక్స్ నోకియా, క్సాన్, లావా, జీఓ, సెల్కాన్, ఎల్ఎఫ్‌వై ఇతర కంపెనీల ఫోన్లు ఉన్నాయి. అలాగే మరో 35 లాట్లు ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్న వాచీలు ఉన్నాయి. వీటిలో టైటాన్, ఫాస్ట్‌ట్రాక్, సోనాటా, హెచ్ఎంటీ, కాసియో, టైమెక్స్, స్మార్ట్, సిటిజెన్, టైమ్స్, టైంవెల్, ఫోసిల్ వాచీలున్నాయి. ఆసక్తి కలిగిన వారు 0877 2264429 నెంబరును సంప్రదించవచ్చని టీటీడీ తెలిపింది.

విద్యాసామగ్రి వితరణ



మంగళం, ఆగస్టు 6: మంగళం ట్రెండ్స్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు ఎంఎస్ మురళి రూ.20వేలు విలువ చేసే విద్యాసామగ్రిని అందజేశారు. మంగళవారం పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి చదువుతున్న సుమారు 220మంది విద్యార్థులకు పెన్నులు, పలకలు, పెన్సిళ్లు, బలపాలు, నోటు పుస్తకాలను, ఐదవ తరగతి విద్యార్థులకు అదనంగా జామెంట్రీ బాక్సులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్‌నాయక్, డీవైఈవో బాలాజీ, క్లస్టర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవులు నాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం: ముగ్గురి అరెస్టు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 6: ఎక్సైజ్ శాఖ అధికారులు మండలంలో జరిపిన దాడుల్లో 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని, ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. పాకాల ఎక్సైజ్ ఎస్సై జయశంకర్ కథనం మేరకు... మండలంలోని నెరబైలు పంచాయతీకి చెందిన మురళి సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొన్నారు. అదేవిధంగా జీవన్ సారా తరలిస్తుండగా పట్టుకొని అరెస్టు చేశారు. చింతగుంట పంచాయతీలో వెంకట సుబ్బయ్య సారా తయారీ చేసి సరఫరా చేస్తుండగా దాడులు చేసి అదుపులోకి తీసుకొన్నట్లు జయశంకర్ తెలిపారు. వీరి వద్ద నుంచి 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన చెప్పారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లామేనేజరు ఫర్జానా

తిరుచానూరు, ఆగస్టు 6: తిరుచానూరు రోడ్డులోని మహిళా ప్రాంగణంలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఐఎల్‌వో సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. మహిళా ప్రాంగణం జిల్లా మేనేజరు ఫర్జానా మాట్లాడుతూ.. మహిళలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తయారు కావడానికి కావాల్సిన మెలకువలు, వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలు, వ్యాపారంలో రాణించడానికి కావాల్సిన అనుమతుల గురించి వివరించారు. ఏపీఎస్ఎస్‌డీసీ రీజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్యామ్‌మోహన్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వ్యాపార అవకాశాలను వివరించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం మాట్లాడుతూ... జిల్లాలో చదువుకుని ఖాళీగా ఉన్న నిరుద్యోగ మహిళలకు ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సుమారు 30మంది మహిళలు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారులు సునేష, మురళీకృష్ణ, ప్రతాప్, మహిళా ప్రాంగణం, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చేనేత దినోత్సవం

మంగళం, ఆగస్టు 6: జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం చేనేతలు ఘనంగా నిర్వహించాలని జాతీయ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సుంకర చిన్నరెడ్డిబాబు మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా చేనేత వస్త్రాలను ఉత్పత్తి చేసి వాటి విలువను పెంచడానికి చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన సహకారం అందించి, చేనేతల సమస్యలను పరిష్కరించిననాడే చేనేత వృత్తిదారులకు నిజమైన చేనేత జాతీయ దినోత్సవం అని ఆయన పేర్కొన్నారు.

ప్రేమ వ్యవహారంలో ఇరువర్గాల ఘర్షణ

- బాలిక అన్న, మేనమామకు కత్తిపోట్లు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 6: ప్రేమ వ్యవహారంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. బాలిక అన్న, మేనమామ కత్తిపోట్లకు గురయ్యారు. ఈ సంఘటన తిరుపతిలో మంగళవారం జరిగింది. తిరుపతి ఈస్ట్ డీఎస్పీ రవిమనోహరాచారి తెలిపిన వివరాల మేరకు.. స్థానిక రైల్వేకాలనీ సమీపంలోని సుందరయ్యనగర్‌లో నివాసముంటున్న బాలు అదే ప్రాంతంలోని ఓ బాలికను ప్రేమించడం మొదలుపెట్టాడు. తరచూ ఆ బాలికతో మాట్లాడటం చూసిన ఆమె పెద్దలు పలుమార్లు మందలించారు. దీనిపై గతంలో ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. అప్పట్లో పోలీసులు ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చి పంపారు. రెండ్రోజుల కిందట సుందరయ్యనగర్‌లో జాతర జరిగింది. ఈ సందర్భంగా బాలు మళ్లీ బాలిక వెంటపడటం మొదలుపెట్టాడు. మంగళవారం ఆమె అన్న లోకేష్ దీన్ని తట్టుకోలేక బాలు కుటుంబీకులతో గొడవపడ్డాడు. మాటామాటా పెరిగి రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. రాళ్లు, కర్రలతో కొట్టుకున్నారు. లోకేష్‌తోపాటు అతడి మేనమామ సురేష్‌పై బాలు వర్గీయులు కత్తితో దాడి చేశారు. లోకేష్‌కు కాలుపై, సురేష్‌కు కడుపు, కాలుపై కత్తిపోట్లు పడ్డాయి. బాధితులను పోలీసులు చికిత్స నిమిత్తం రుయాస్పత్రిలో చేర్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కత్తిపోట్లకు గురైన లోకేష్, సురేష్‌ను విచారిస్తున్న పోలీసులు

తెలంగాణ బాలుడి కథ సుఖాంతం

- మీర్‌పేటలో మిస్సైన విద్యార్థిని తిరుపతిలో గుర్తించిన పోలీసులు



పోలీసుల సంరక్షణలో ఉన్న మహీధర రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 6: తెలంగాణకు చెందిన బాలుడు మహీధర రెడ్డి ఆచూకీ తిరుపతిలో లభ్యమైంది. మంగళవారం వివరాలను డీఎస్పీ రవిమనోహరాచారి మీడియాకు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలోని మీర్‌పేటకు చెందిన కవిత, మధుసూధనరెడ్డిల కుమారుడు మహీధర రెడ్డి రోజులాగా ఆగస్టు 4న సాయంత్రం తన అన్న మౌనేందర్ రెడ్డితో కలసి ట్యూషన్‌కు వెళ్లాడు. ట్యూషన్ అయ్యాక అన్న ఇంటికి వెళ్లాడు. మహీధర రెడ్డి మాత్రం ఇంటికి రాలేదు. ఎంతకీ రాకపోవడంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించారు. ఫలితం లేకపోవడంతో మీర్‌పేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే మహీధర రెడ్డి ట్యూషన్ నుంచి ఇంటికి వెళ్లకుండా తాను దాచుకున్న రూ.1000లతో హైదరాబాదు నుంచి ఆదివారం రాత్రి రైలెక్కి సోమవారం తిరుపతికి వచ్చాడు. తర్వాత తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నాడు. తిరిగి బస్సులో బయల్దేరి తిరుపతి శ్రీహరి బస్టాండు వద్దకు చేరుకున్నాడు. ఇక్కడ బిక్కు, బిక్కుమంటూ తచ్చాడుతున్న బాలుడిని బస్టాండులోని అవుట్ పోస్టు పోలీసులు చేరదీసి విచారించారు. తల్లిదండ్రుల పేర్లు, అడ్రస్ చెప్పడంతో వెంటనే ఈస్ట్ పోలీసుస్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. జరిగిన విషయాన్ని బాలుడు తల్లి దండ్రులకు తెలియచేసి తిరుపతికి రమ్మని చెప్పారు.

బాలల సంరక్షణ కేంద్రానికి తరలింపు

తిరుపతి ఈస్ట్ పోలీసుల వద్ద ఉన్న మహీధర రెడ్డిని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో మంగళవారం సాయంత్రం డీఎస్పీ పర్యవేక్షణలో పోలీసులు బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. బాలుడిని గుర్తించిన తిరుపతి ఆర్టీసీ బస్టాండు అవుట్ పోస్టు పోలీసులను పలువురు అభినందించారు.

మా కుటుంబానికి న్యాయం చేయండి



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న మాతయ్య కుటుంబసభ్యులు

భాకరాపేట, ఆగస్టు 6: మా కుటుంబానికి న్యాయం చేయాలని చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె హరిజనవాడకు చెందిన మాతయ్య తన కుటుంబసభ్యులతో కలిసి ఎంపీడీవో సోమశేఖరరెడ్డికి మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాతయ్య మాట్లాడుతూ.. గతంలో జంగావాండ్లపల్లెకు చెందిన బాలాజీ మా కుటుంబానికి చెందిన యువతికి ఫోను చేసి అసభ్యకరంగా మాట్లాడటంతో తన కుమారుడు వెంకటరమణ ఫోన్లో అతడిని ప్రశ్నించారని తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురూ వాగ్వాదం చేసుకున్నారని, ఈ విషయాన్ని గ్రామ పెద్దలకు తెలుపగా, వారు పంచాయితీ చేశారన్నారు. తాను యువతికి ఫోను చేయలేదని, అనవసరంగా నిందలు వేస్తున్నారని బాలాజీ గ్రామ పెద్దలకు తెలిపాడన్నారు. దాంతో వారు వెంకటరమణను దోషిగా చేసి బాలాజీ కాళ్లు పట్టించారని చెప్పారు. వీరువురికీ జరిమానా కూడా విధించారని అన్నారు. బాలాజీకి మాత్రం ఎలాంటి దండన విధించకుండా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత కాలం తర్వాత వెంకటరమణ తన కాల్ రికార్డింగ్ ద్వారా బాలాజీని దుర్భాషలాడలేదని తెలియజేసినా గ్రామ పెద్దలు ఎలాంటి న్యాయం చేయలేదని వాపోయారు. అలాగే గతంలో గ్రామంలో జరిగిన మాతమ్మ జాతరలో తమకు పాల్గొనే అవకాశం కల్పించలేదని తెలిపారు. ఈనెల 5న జరిగిన జాతరలో పాల్గొనే అవకాశం కల్పించమని కోరినా కూడా పట్టించుకోలేదన్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

జీవాల పెంపకంతో స్వయం ఉపాధి

తిరుపతి రూరల్, ఆగస్టు 6: పశుగణోత్పత్తిని వ్యాపారసరళిలో(మాంస) ఎంపిక చేసుకుని స్వయం ఉపాధిని పొందవచ్చని ఎస్వీ వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ పి.జగపతిరామయ్య తెలిపారు. వెటర్నరీ కళాశాల లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ విభాగం(ఎల్‌పీఎం) ఆధ్వర్యంలో ఐసీఏఆర్-ఎస్సీ సబ్‌ప్లాన్ ఆర్థిక సౌజన్యంతో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు మీట్ యానిమల్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్‌పై మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆ విభాగ హెడ్, ఆర్గనైజర్ ప్రొఫెసర్ డాక్టర్ జి.గంగరాజుతో కలసి అసోసియేట్ డీన్ మాట్లాడారు. జీవాలు, సీమపందులు, కుందేళ్లు, కోళ్ల పెంపకం ద్వారా స్వయం ఉపాధితోపాటు అధిక ఆదాయాన్ని ఆర్జించవచ్చని తెలిపారు. పశుగణోత్పత్తిపై డాక్టర్ డి.సురేష్, విలువ ఆధారిత మాంస ఉత్పత్తుల తయారీపై ఎల్‌పీటీ విభాగ అధ్యాపకులు డాక్టర్ జి.విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ ఇందుమతి, కోళ్లపెంపకంపై డాక్టర్ షకీలా, సీమపందుల పెంపకంపై డాక్టర్ ఎం.కళ్యాణచక్రవర్తిలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌తోపాటు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం.వాణి, డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఏడీ జగపతిరామయ్య, డాక్టర్ గంగరాజు, అధ్యాపకులు

‘దేవర’ మొదటిపాట విజయవంతం సంతోషానిచ్చింది

సినీ గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి



తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనానికి బయల్దేరే ముందు విడుదలైన ‘దేవర’ చిత్రంలోని మొదటిపాట సంతోషాన్నిచ్చిందని, ప్రతిఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని ప్రముఖ సినీగేయ రచయిత రామజోగయ్య శాస్త్రి అన్నారు. తన చిన్న కుమారుడితో కలిసి మంగళవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రతిఏడాది స్వామి దర్శనానికి రావడం తనకు ఆనవాయితీ అన్నారు. అయితే ఈసారి ప్రత్యేక కారణంతో తిరుమలకు వచ్చానని, తన పెద్ద కుమారుడి వివాహం ఈనెల్లో జరగనున్న నేపథ్యంలో స్వామివారికి మొదటి ఆహ్వానపత్రికను అందజేసేందుకు వచ్చానన్నారు. ఇలానే మంచి మంచి పాటలు తనతో రాయించాలని స్వామిని కోరుకున్నట్లు చెప్పారు.

డయేరియాతో మెరైన్ హోంగార్డు మృతి

వాకాడు, ఆగస్టు 6: డయేరియాతో దుగరాజపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డు రాజేష్ (34) మంగళవారం మృతి చెందాడు. తూపిలిపాళెం గ్రామానికి చెందిన రాజేష్ 2013 నుంచి దుగరాజపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం తీవ్ర విరేచనాలు, వాంతులు కావడంతో కోట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పింగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు.

గిరిజన అభ్యర్థులకు జాబ్‌మేళా

- 12న శ్రీకాళహస్తి ఎస్వీపీ కళాశాలలో ఎంపికలు

తిరుపతి(విద్య), ఆగస్టు 6: టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణులైన గిరిజన అభ్యర్థులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌కు చెందిన ఎస్‌కే సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈనెల 12న ప్రత్యేకంగా గిరిజన అభ్యర్థులకోసం జాబ్ మేళాను శ్రీకాళహస్తి ఎస్వీపీ మెన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనుంది. ఇంగ్లిష్ చదవడం, రాయడం తెలిసి ఉండాలి. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్, చెన్నై ప్రాంతాల్లో అమెజాన్‌లో పికింగ్, ప్యాకింగ్, స్కానింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ వంటి ఉద్యోగాలు చేయాల్సి ఉంటుంది. వారానికి ఐదు రోజులు పగలు, రాత్రి షిఫ్ట్ విధానంలో నెలకు రూ.17,000 జీతం ఉంటుంది. పీఎఫ్, ఈఎస్ఐతోపాటు అదనపు పనికి అదనపు వేతనం ఉంటుంది. మరిన్ని వివరాలకు 94935 24121, 84650 43892 నెంబర్లలో సంప్రదించవచ్చు.

తిరుపతి రూరల్‌లో చోరీ

- అన్నమయ్యనగర్‌లో 118 గ్రాముల బంగారు నగల అపహరణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 6: తిరుపతి రూరల్ లింగేశ్వరనగర్ పంచాయతీ అన్నమయ్యనగర్‌లో భారీ చోరీ జరిగింది. 118 గ్రాముల బంగారు నగలు అపహరించుకెళ్లారు. ఎంఆర్‌పల్లె ఎస్‌ఐ షేక్ షావలి తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్యనగర్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి రామయ్య కాపురముంటున్నాడు. మంగళవారం సాయంత్రం 4.10 గంటల ప్రాంతంతో పాఠశాలలో చదువుతున్న కుమారుడిని తీసుకురావడానికి ఆయన భార్య ఇంటికి తాళం వేశారు. ఆ తాళాన్ని బయట సోఫాలో పెట్టి వెళ్లింది. 20 నిమిషాల తర్వాత తిరిగొచ్చేసరికి తాళాలు తీసి ఉన్నాయి. లోపలకెళ్లి చూడగా బీరువాలోని 118 గ్రాముల బంగారు నగలు కనిపించలేదు. జరిగిన విషయాన్ని భర్తకు తెలియజేసింది. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాగా తెలిసినవారే చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తుపాకీతో బెదిరించి టీడీపీ కార్యకర్త కిడ్నాప్.. దాడి

- పుంగనూరులో టీడీపీ శ్రేణుల ఆందోళన
- నిందితులను అరెస్టు చేయాలని ఫిర్యాదు



పుంగనూరులో ఆర్వీటీ బాబు ఇంటి వద్ద గుమికూడిన టీడీపీ శ్రేణులు

పుంగనూరు, ఆగస్టు 6: బహిర్భూమికి వెళ్లిన టీడీపీ కార్యకర్తను తుపాకీతో బెదిరించి కిడ్నాప్ చేసి దాడి చేశారు. నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ పుంగనూరు టీడీపీ శ్రేణులు మంగళవారం ఆందోళనకు దిగారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. పుంగనూరులో సోమవారం మంత్రి రాంప్రసాద్ రెడ్డి పర్యటనలో భాగంగా భీమగానిపల్లె పంచాయతీ కమతంపల్లెకు చెందిన వైసీపీ కార్యకర్త శ్రీనివాసులు, మరికొందరు వచ్చారు. మంత్రిపై పూలు చల్లడంతో టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తమను ఇబ్బందులు పెట్టి మళ్లీ ఎలా వస్తారంటూ టీడీపీ నాయకులు ప్రశ్నించారు. మాటామాటా పెరిగి గొడవ జరిగింది. ఈ క్రమంలో ఎన్నికల ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన పుంగనూరు నేత ఆర్వీటీ బాబును వైసీపీకి చెందిన భీమగానిపల్లె మాజీ ఎంపీటీసీ హేమచంద్ర తదితరులు కలిసి మంత్రి పర్యటనలో తమ వారిపై దాడి జరిగిందని చెప్పారు. తన అనుచరులపై దాడి చేస్తారా అంటూ ఆయన ఆగ్రహించారు. ఆర్వీటీ బాబు అనుచరులు కొందరు, ప్రైవేటు గన్‌మ్యాన్ మంగళవారం ఉదయం భీమగానిపల్లెకి చెందిన టీడీపీ నాయకుడు రామాంజులు కుమారుడు డి.మణికంఠ గ్రామ సమీపంలోని చెరువువద్ద ఉండగా పట్టుకున్నారు. తుపాకీ చూపి చంపేస్తామని బెదిరించి కిడ్నాప్ చేశారు. పుంగనూరులోని ఆర్వీటీ బాబు ఇంటికి తీసుకెళ్లి నిర్బంధించారు. ఈ విషయం తెలిసి భీమగానిపల్లె నుంచి భారీగా టీడీపీ శ్రేణులు.. ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు మణికంఠను విడిపించేందుకు ఆర్వీటీ బాబు ఇంటికి బయల్దేరారు. ఈ విషయం తెలిసి సీఐ జయరామయ్య సిబ్బందితో వెళ్లి టీడీపీ వారిని అడ్డుకుని గొడవ చేయరాదని సూచించారు. మణికంఠను విడుదల చేసి, నిందితులను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని టీడీపీ శ్రేణులు డిమాండు చేశారు. ఆర్వీటీ బాబు ఇంటి లోపల ఉన్న టీడీపీ కార్యకర్త మణికంఠ, ప్రైవేట్ గన్‌మ్యాన్‌ను పోలీసులు పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. తమకు న్యాయం చేయాలంటూ టీడీపీ శ్రేణులూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఈ ఘటనపై రాజీ చేయాలని ఆర్వీటీ బాబుకు మద్దతుగా మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ సీఐతో మాట్లాడారు. టీడీపీ నేత ఆర్వీటీబాబు, వైసీపీకి చెందిన హేమచంద్ర, డ్రైవర్ హరి, ప్రసాద్, శీనా, హరి, నరేశ్, కిషోర్‌తో పాటు మరికొందరు తనను కొట్టి, తుపాకీతో బెదిరించారని బాధితుడు మణికంఠ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము మణికంఠను కిడ్నాప్ చేయలేదని, ఇంటి వద్దకు పిలిపించి గొడవలు చేయకుండా కలసిమెలసి ఉండాలని చెప్పినట్లు ఆర్వీటీ బాబు చెప్పారు. ఇటీవల టీడీపీలో చేరిన ఈయన వైసీపీ శ్రేణులతో కలిసిమెలసి ఉంటూ అసలైన టీడీపీ వారిని ఇబ్బంది పెట్టడం తగదని నాయకులు అంటున్నారు. ఈ ఘటనపై పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదు.

పాతకాల్వలో నేటినుంచి మహాభారత మహోత్సవం



ఉత్సవాల పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, ఆగస్టు 6: తిరుపతి రూరల్ మండలం పాతకాల్వ గ్రామంలో బుధవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో 32వ మహాభారత మహోత్సవం జరగనుంది. తనపల్లెలోని రఘునాథ రిసార్ట్స్‌లో ఈ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను గ్రామ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం ఆవిష్కరించారు. బుధవారం ఉదయం 6.00 - 6.30 గంటల్లోపు స్వామివారి ధ్వజారోహణంతో ఈ ఉత్సవం ప్రారంభమై.. 18న కర్ణమోక్షం, దుర్యోధనవధతో ముగియనుందని కమిటీ ప్రతినిధులు వివరించారు. శ్రీలలిత నాటక కళామండలి ఆధ్వర్యంలో రోజూ రాత్రి 9గంటలకు శ్రీకృష్ణలీలలు, హిడింబాసురవధ, బకాసురవధ, ద్రౌపదీ కల్యాణం, కీచకవధ, శ్రీకృష్ణరాయబారం, దుర్యోధుని వధ వంటి నాటకాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రతి రోజూ రేడియా ఆర్టిస్ట్ మునిలక్ష్మి భాగవతారిణి నేతృత్వంలో హరికథాగానం ఉంటుందని వివరించారు.

రిజిస్ట్రేషన్లకు గడువు ఇవ్వండి

- మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ వినతి



స్రవంతికి వినతిపత్రం అందజేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్స్

మంగళం, ఆగస్టు 6: నగర పరిధిలోని క్లినికల్ ల్యాబ్‌లను నిర్వహిస్తున్న తమకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకునేందుకు గడువు ఇవ్వాలని తిరుపతి మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. మంగళంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులకు ఈమేరకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. తామంతా అర్హత కలిగిన ల్యాబ్ టెక్నీషియన్లమేనని, పారా మెడికల్ రిజిస్ట్రేషన్ ఉందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, అగ్నిమాపక, వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అనుమతులు వచ్చే వరకు తమకు ల్యాబ్‌లను నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని డీఎంహెచ్‌వోకు కూడా ఇచ్చామని తెలిపారు.

సచివాలయాల తనిఖీ

రామచంద్రాపురం, ఆగస్టు 6: మండలంలోని రామాపురం, కేకేవీపురం, సొరకాయలపాళెం, నెన్నూరు గ్రామ సచివాలయాలను తహసీల్దారు వెంకటరమణ మంగళవారం తనిఖీ చేశారు. ప్రజల వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిందిగా సూచించారు. ప్రభుత్వ భూములుఎక్కడైనా ఆక్రమణలకు గురైతే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. రికార్డులు పరిశీలించి సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఆర్ఐ కృష్ణమ్మ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి రోల్ బాల్ పోటీల్లో పతకాలు



చంద్రగిరి, ఆగస్టు 6: మామండూరు సమీపంలోని కాండర్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి రోల్ బాల్ పోటీల్లో రెండు బంగారు, ఓ కాంస్య పతకాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగశ్వేత తెలిపారు. గత నెల 27, 28 తేదీల్లో వైజాగ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-11 పోటీల్లో చంద్రగిరికి చెందిన చిరాగ్‌కృష్ణ, నిహాల్‌రెడ్డిలు బంగారు పతకాలను, బాలికల విభాగంలో యోషిత కాంస్య పతకాన్ని సాధించింది. అండర్-17 బాలుర విభాగంలో పురుషోత్తం, లలిత్, మర్వాన్, హరీష్, హేత్విక్‌లు రజత పతకాలను సాధించినట్లు వివరించారు. విద్యార్థులను, కోచ్ కార్తీక్‌ను మంగళవారం ప్రిన్సిపాల్ అభినందించారు.

రైలు ప్రయాణికులకు సేవ చేయడం అదృష్టం



కమిటీ సభ్యులుగా గుర్తింపు కార్డులను అందజేస్తున్న దృశ్యం

చంద్రగిరి, ఆగస్టు 6: రైలు ప్రయాణికులకు సేవ చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు చంద్రగిరి మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి నరేష్‌కుమార్ నాయుడు అన్నారు. స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా నరేష్‌కుమార్ నాయుడు, సంగీతం దొరస్వామిలకు రైల్వే శాఖ గుర్తింపు కార్డులను మంగళవారం చంద్రగిరి స్టేషన్ మాస్టర్ సంగీత లక్ష్మి పంపిణీ చేశారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ చంద్రగిరి రైల్వేస్టేషన్లో ప్రయాణికుల సౌకర్యార్థం మెరుగైన చర్యలు తీసుకోవడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. తమను స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా నియమించినందుకు రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్, బీజేపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూరపనేని జగదీష్ నాయుడు, వెంకటమునిలకు కృతజ్ఞతలు తెలిపారు.

పుత్తూరుకు చెందిన సినీ అసిస్టెంట్ ఎడిటర్ మృతి

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సినీ అసిస్టెంట్ ఎడిటర్‌గా పని చేస్తున్న పుత్తూరుకు చెందిన మణిరత్నం రెడ్డి వడపళనిలో మృతి చెందారు. ‘టౌన్‌బస్’ అనే లాడ్జిలో బస చేసిన ఆయన వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం. మంగళవారం ఉదయం ఆయన మందులు కొనుగోలు చేసేందుకు లాడ్జి నుంచి బయటకు వచ్చారు. బయటకు రాగానే ఆయన స్పృహ తప్పి పడిపోయారు. దీనిని గమనించిన చుట్టుపక్కల వారు 108 అంబులెన్సును రప్పించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు తేలింది. ఆయన మృతదేహన్ని కేకే నగర్ ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం

వర్సిటీ అధికారులకు చంద్రబాబు హామీ



సీఎం చంద్రబాబును కలిసిన వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 6: ఎస్వీయూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన అన్ని విధాల సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇటీవల నియమితులైన వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు విజయవాడలో మంగళవారం చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి, సత్కరించారు. అంతకు మునుపు యూనివర్సిటీ పరిస్థితులను సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూనివర్సిటీలో అమలు చేయనున్న సంస్కరణలు, నూతన అభివృద్ధి ప్రణాళికలపై సీఎంకు అధికారులు వివరించారు.

కోనేటి సుబ్బరాజుకు ఆత్మీయ సత్కారం



తిరుపతి (కల్చరల్), ఆగస్టు 6: తిరుపతికి చెందిన రంగస్థల కళాకారుడు కోనేటి సుబ్బరాజును ఆయన మిత్రబృందం మంగళవారం సాయంత్రం సుబ్బరాజు కళాపరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల సుబ్బరాజు విశ్వనటచక్రవర్తి, రంగస్థల రత్నం బళ్లారి రాఘవ జాతీయ పురస్కారం అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ ఆత్మీయ సత్కారం జరిగింది. గత 25 సంవత్సరాలకు పైగా జాతీయ, రాష్ట్రస్థాయిలో అనేక నాటకాలలో పాల్గొంటూ, కళాపరిషత్ పోటీలను తిరుపతిలో నిర్వహిస్తూ సుబ్బరాజు చేస్తున్న కళాసేవకు గుర్తుగా ఈ పురస్కారం లభించినట్లు పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వేత్త మబ్బు సూర్యనారాయణ రెడ్డి, టీటీడీ విశ్రాంత ఉద్యోగి చిన్నంగారి రమణ, రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గోపీనాథ్ రెడ్డి, గాయకులు ఆమూరి సుబ్రమణ్యం, నటుడు శాంబోలు హరనాథ్ పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవి ఇప్పించండి



వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాసుల యాదవ్

తిరుపతి అర్బన్,ఆగస్టు6:నామినేటెడ్ పదవి ఇప్పించాలని తిరుపతి టీడీపీ పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్‌కు రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరి శ్రీనివాసుల యాదవ్ వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఆయన స్థానిక లక్ష్మీపురం కూడలిలోని నివాసంలో నరసింహులయాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, శాలువకప్పి సన్మానించారు. 1983నుంచి టీడీపీ జెండా మోస్తున్నానని, సేవా కార్యక్రమాలు చేశానని, వయస్సు రీత్యా ఏదో ఒక పదవి తప్పనిసరిగా ఇప్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జున



కె.మల్లికార్జున - బి.మల్లికార్జున - మునిబాలకుమార్

తిరుపతి అర్బన్, ఆగస్టు 6: ఏపీ నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.వి.రమణయ్య సూచన మేరకు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక అన్నారావు కూడలి వద్ద పట్టాకాంప్లెక్స్‌లో మంగళవారం సంఘం సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా కె.మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా భజంత్రి మల్లికార్జున, గౌరవాధ్యక్షుడిగా పి.మునిబాలకుమార్, రాధాదేవి, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ, ట్రెజరర్‌గా కామరాజు, సంయుక్త కార్యదర్శిగా డి.చంద్రమోహన్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మనోహర్, మైనంపాటి సాయి, శంకర్, యుగంధర్, అమర్, సురేంద్రబాబు, రమేష్‌బాబు ఎంపికయ్యారు.

కిరణ్‌రాయల్‌కు పలువురి శుభాకాంక్షలు



జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, ఆగస్టు 6: జనసేన తిరుపతి నియోజకవర్గ ఇంచార్జ్ కె.కిరణ్‌రాయల్ జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగుకాళ్ల మండపం వద్ద అన్నదానం చేశారు. ఆంధ్రాబ్యాంకు కాలనీలోని తననివాసం వద్ద కూటమి నాయకులు, కార్యకర్తలు, వేలాదిమంది అభిమానుల మధ్య భారీ కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని, కూటమి ముఖ్యనేతలు ఎస్వీ ప్రసాద్, సైకం జయచంద్రారెడ్డి, చిన్నంగారి రమణ, ఊకా విజయ్‌కుమార్, నరసింహాయాదవ్, చిన్నబాబు, భానుప్రకాష్‌రెడ్డి, కోలా ఆనంద్, సామంచి శ్రీనివాసులు తదితరులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నిస్సాన్ ఎక్స్ ట్రయిల్ కారు ఆవిష్కరణ



మార్కెట్‌లోకి నిస్సాన్ ఎక్స్ ట్రయిల్ కారును విడుదల చేస్తున్న దృశ్యం

తిరుపతి (జీవకోన), ఆగస్టు 6: నగరంలోని రేణిగుంట రోడ్డులో గల హైటెక్ నిస్సాన్ షోరూమ్‌లో మంగళవారం సాయంత్రం నిస్సాన్ ఎక్స్ ట్రయిల్ కారును ఎండీ జగన్నాథరెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. నిస్సాన్ ఎక్స్ ట్రయిల్ కారు అత్యాధునిక ఫ్యూచర్స్ కలిగి ఉందన్నారు. వీసీ టర్బో ఇంజన్, 360 డిగ్రీ కెమెరా, పనోరమిక్ ఎలక్ట్రికల్ సన్‌రూఫ్, ఎయిర్‌బ్యాగ్, ఆల్ వీల్ డిస్క్ బ్రేక్స్‌తో ఉన్నాయని తెలిపారు. ఈ వాహనం మూడు రకాల్లో ఉందని, దీని షోరూం విలువ రూ.49,92,000 అన్నారు. బుకింగ్ కోసం 90004 54634 నెంబరును సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు చెరకు నిరంజన్, సి.భారతి, సి.హోషిమారెడ్డి, షోరూం జనరల్ మేనేజరు ఎస్వీఎస్ శాస్త్రి, నిస్సాన్ రీజినల్ సేల్స్ మేనేజరు సీబీ ఆనంద్, టీటీడీ ముఖ్య అర్చకులు కిరణ్ దీక్షితులు, కెన్సెస్ ప్రభాకర్‌రెడ్డి, గేట్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జీవో 117తో ఉపాధ్యాయుల సర్దుబాటు సరికాదు: ఆపస్

తిరుపతి(విద్య), ఆగస్టు 6: విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేస్తూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవోతోనే ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయడానికి కూటమి ప్రభుత్వం పూనుకోవడం సమంజసం కాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. ఉపాధ్యాయ సంఘాలన్నీ ముక్తకంఠంతో వ్యతిరేకించినా ఏమాత్రం పట్టించుకోకుండా గత వైసీపీ ప్రభుత్వం 117 జీవో తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఆ జీవో వల్ల పాఠశాల విద్య అన్ని విధాల నష్టపోయిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే జీవోతో టీచర్లను సర్దుబాటు చేయడానికి ప్రయత్నించడం సబబు కాదన్నారు. వెంటనే ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించి విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్ర మంత్రిని కలసిన పీసీరాయల్



తిరుపతి అర్బన్, ఆగస్టు 6: తిరుపతి ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్ డాక్టర్ పీసీ రాయలు మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి మురళీధర్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువకప్పి సత్కరించారు. శ్రీవారి లడ్డూప్రసాదాలను అందజేశారు. అనంతరం తిరుపతి విమానాశ్రయం అభివృద్ధి అంశాలకు సంబంధించి పరస్పరం చర్చించుకున్నారు.

అనుమతుల్లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటుచేస్తే కఠిన చర్యలు

భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్త రోడ్లపై వేయొద్దు - కమిషనర్ మౌర్య



డ్రైనేజీలను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా, ప్రజలకు ఇబ్బంది కలిగేలా నగరంలో హోర్డింగులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. మంగళవారం పారిశుధ్య పనులను, అన్న క్యాంటీన్ల పునః ప్రారంభోత్సవ పనులను, డ్రైనేజీ కాలువలను, అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తెల్లవారుజామున కవర్లు, గోతాల్లో చెత్త రోడ్లపై వేస్తున్నారని, వీటి వలన అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి రోజూ మీ ఇంటి వద్దకే వచ్చే పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇచ్చి ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. నగరంలో ఎక్కడా వర్షపు నీరు నిలవకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చమని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఎస్ఈ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, డీఈలు విజయకుమార్ రెడ్డి, శ్రావణి, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వం 16 వేలు

గత ఏడాదితో పోల్చితే మూడు రెట్లు ఎక్కువ - శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నియోజకవర్గంలో జనసేన క్రియాశీలక సభ్యత్వం 16వేలు దాటింది. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో తిరుపతి 13వ స్థానంలో నిలిచింది. గత ఏడాది 4,700 మంది జనసేన సభ్యత్వం తీసుకుంటే ఈఏడాది 16,065 మంది తీసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే మూడింతలు క్రియాశీలక సభ్యత్వం పెరిగింది. తిరుపతిలో రికార్డుస్థాయిలో సభ్యత్వ నమోదు పెరగడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన జనసైనికులు, నాయకులు, వీరమహిళలు, యువతకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గత నెల 18న ఎమ్మెల్యే ఆరణి తన నివాసంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదును ప్రారంభించారు. 18వ తేదీ నుంచి 28వ తేది వరకు సభ్యత్వ నమోదుకు గడువుగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయించారు. అయితే పార్టీ శ్రేణుల నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు జూలై 28 నుంచి ఈనెల 5వ తేదీ వరకు సభ్యత్వ నమోదుకు జనసేన అవకాశం కల్పించింది. తిరుపతి నియోజకవర్గంలో ఆరణి మదన్ 1050 మందిని పార్టీ సభ్యులుగా చేర్చి ఎక్కువ మందిని చేర్చిన వారిలో మొదటి వ్యక్తిగా నిలిచారు. అదేవిధంగా రాష్ట్ర ఉద్యోగుల సంఘ మాజీ నాయకుడు, ఆపార్టీ నేత ఎం.నరసింహులు నాయుడు 500కు పైగా సభ్యత్వ నమోదుచేసి రెండో స్థానంలో నిలిచారు. నాలుగో విడత జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదులో 500కు పైగా సభ్యత్వం నమోదుచేసిన రాష్ట్ర స్థాయి 8మంది నాయకుల్లో నరసింహులు నాయుడు మొదటి స్థానంలో నిలిచారు. ఎమ్మెల్యే వీరిని ప్రత్యేకంగా అభినందించారు.

ఉచిత వైద్యశిబిరాలను వినియోగించుకోండి

జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు



మాట్లాడుతున్న రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు

తిరుపతి (ఆటోనగర్), ఆగస్టు 6: నగర ప్రజలు స్వచ్ఛంద సేవా సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రులు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు సూచించారు. తిరుపతి రాస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం రాష్ట్రీయ సేవా సమితి, అమర ఆస్పత్రి యాజమాన్యం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత యోగా వైద్య శిబిరాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాన్య ప్రజలు ఆరోగ్య సమస్యలపై పరీక్షలు చేయించుకోవాలంటే అధికమొత్తంలో డబ్బు ఖర్చు అవుతోందన్నారు. ఉచిత వైద్య శిబిరాల్లో ఖరీదైన ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేసుకోవచ్చునని తెలిపారు. ప్రజలు ఆరోగ్యం పట్ల ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. రాస్‌ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు మాట్లాడుతూ తమ సంస్థ పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, పేద ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఈ శిబిరంలో రక్త పరీక్షలతో పాటు బీపీ, షుగర్, గుండె, గైనిక్, కిడ్నీ, ఈఎన్‌టీ, సాధారణ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా 500 మందికి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వికలాంగులకు ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు అందజేశారు. డాక్టర్లు వెంకటశివక్రిష్ణ, భానుప్రకాష్, అశోక్‌రెడ్డి, శివపార్వతి, రాస్ డైరెక్టర్ వి.నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ధర్నా



తిరుపతి(విద్య), ఆగస్టు 6: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్‌కుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నవీన్, ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ... జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. కనీసం మరుగుదొడ్లు, స్నానపు గదులుకూడా లేని హాస్టళ్లు చాలా ఉన్నాయని చెప్పారు. 70 శాతం భవనాలు పాతబడి నేడో రేపో కూలిపోయేలా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి నూతన భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లను కూడా సొంత భవనాల్లోకి మార్చాలని కోరారు. ఖాళీగా ఉన్న వార్డెన్, ట్యూటర్, అటెండర్, కమాటి, కుక్ పోస్టులను, ప్రభుత్వ పాఠశాలల, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం వారు డీఆర్వో పెంచలకిషోర్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సూర్య, వినయ్, ఓంరాజ్, హరికృష్ణ, చందు, వసుంధర, నాయకులు హరి, మోహన్, సోము, మహేష్, వసతి గృహాల విద్యార్థులు పాల్గొన్నారు. పోలీసులు కలెక్టరేట్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

బలిజలకు సామాజిక న్యాయం కోసం కృషి చేద్దాం



మాట్లాడుతున్న గ్రేటర్ రాయలసీమ బలిజ నేతలు

తిరుపతి (కపిలతీర్థం), ఆగస్టు 6: గ్రేటర్ రాయలసీమలో బలిజలకు రాజకీయ, సామాజిక న్యాయం సాధించుకునేందుకు బలిజలందరూ కలిసి కృషి చేద్దామని గ్రేటర్ రాయలసీమ బలిజ మహాసభ నేతలు రామ్‌ప్రసాద్, శివప్రసాద్, కృష్ణప్రసాద్‌లు పిలుపునిచ్చారు. తిరుపతిలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వీరు బలిజ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు బలిజలు ఎంతగానో కృషి చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బలిజలను ఎంతగానో ఇబ్బందులకు గురి చేశారని, అయినప్పటికీ ఆత్మవిశ్వాసంతో కూటమి ప్రభుత్వ విజయానికి బలిజ సామాజిక వర్గం ఎంతో పనిచేసిందన్నారు. గ్రేటర్ రాయలసీమలోనే 72 అసెంబ్లీ, 10 పార్లమెంటు స్థానాల్లో బలిజలు అధికంగా ఉన్నప్పటికీ రాజకీయ అధికార పదవులు అందని ద్రాక్షలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ బలిజ అభ్యున్నతికి కృషి చేస్తారనే నమ్మకం మాకు ఎంతగానో ఉందని చెప్పారు. బలిజల అభ్యున్నతి కోసం త్వరలోనే చంద్రబాబును, పవన్‌కళ్యాణ్‌ను, పురందేశ్వరిని కలిసి తమ సమస్యలను వివరించి, సామాజిక న్యాయం చేయాలని కోరతామన్నారు. నేతలు భాస్కర్, బాలాజీ, కృష్ణయ్య, నీలకంఠం, దొరబాబు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలి

● మున్సిపల్ కమిషనర్‌కు ఎస్ఎఫ్ఐ వినతి



తిరుపతి(విద్య), ఆగస్టు 6: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో ఇస్కాన్ భోజనాన్ని రద్దుచేసి, దానికి బదులుగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు కమిషనర్ మౌర్యను ఆమె ఛాంబర్‌లో కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్ మాట్లాడుతూ... ఇస్కాన్ ఉదయం 6 గంటల సమయానికే భోజనాన్ని సిద్ధంచేసి 9 గంటలకల్లా పాఠశాలలకు చేరవేస్తారని చెప్పారు. అనంతరం సుమారు 6 గంటల సమయం తరువాత మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో చల్లారిపోయిన ఆహార పదార్థాలను వడ్డిస్తారని, దీనివల్ల విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందడం లేదని కమిషనర్‌కు వివరించారు. విద్యార్థుల కోసం చొరవ తీసుకుని మున్సిపల్ పాఠశాలల్లో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు బాల, వినోద్, నరేంద్ర కమిషనర్‌ను కలిసినవారిలో ఉన్నారు.

వ్యవసాయ రంగానికి మౌలిక వసతులు కల్పించండి

● కిసాన్ మోర్చా నేతలు



తిరుపతి (కపిలతీర్థం), ఆగస్టు 6: గతవైసీపీ ప్రభుత్వం జిల్లాలోని రైతులను పూర్తిగా దగా చేసిందని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం జిల్లాలోని వ్యవసాయ రంగానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరకాల మోహన్‌బాబు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన కిసాన్ మోర్చా నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ... గడిచిన ఐదేళ్లలో జిల్లాలోని రైతులకు రాయితీలు, సాగుకు నీరు, సబ్సిడీ విత్తనాలు అందక తీవ్రంగా నష్టపోయారన్నారు. కనీసం కేంద్ర ప్రభుత్వం అందించే పంటల బీమా యోజన పథకం కూడా రైతులకు అందకుండా వైసీపీ ప్రభుత్వం దగా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల శ్రేయస్సుకు శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా సాగునీటి కాలువల్లో పూడిక తీత పనులకు శ్రీకారం చుట్టి రైతులకు సజావుగా సాగు నీరందేలా చూడాలని వారు కోరారు. ఈ విషయంపై ఇప్పటికే జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందించామన్నారు. కిసాన్ మోర్చా రైతు నేతలు తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు జనసేన చేయూత



మధుబాబు

తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 6: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో కేరళలోని వయనాడ్ బాధితులకు చేయూతగా నిలిచేందుకు తమ సిబ్బందితో కలిసి వయనాడ్‌కు పయనమవుతున్నట్లు జనసేన నేత బత్తెన మధుబాబు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న రాష్ట్ర ప్రజల కోసం తమ జనసేనాని సొంత నిధులు ఖర్చు చేసిన స్ఫూర్తితో తాను కూడా బాధితులను ఆదుకునేందుకు తన క్యాటరింగ్ సిబ్బందితో కలిసి వయనాడ్ బయల్దేరుతున్నట్లు తెలిపారు. అక్కడ వారికి తమవంతుగా సాయం అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

9న ఢిల్లీలో నిర్వహించే ధర్నాకు తరలిరండి

● బీసీ సంక్షేమ సంఘం పిలుపు



తిరుపతి (కపిలతీర్థం), ఆగస్టు 6: బీసీల సమస్యల సాధన కోసం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్‌రావు పిలుపు మేరకు ఈ నెల 9న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే బీసీల ధర్నాకు జిల్లాలోని బీసీలందరూ తరలిరావాలని బీసీ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మంగళవారం బీసీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 200 మందికి పైగా బీసీలు ఈ నెల 8న ఢిల్లీకి పయనమవుతున్నట్లు తెలిపారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ 11వరకు రద్దు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 6: కడప-తిరుపతి-విశాఖపట్టణంల మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ మంగళవారం నుంచి ఈనెల 11వ తేదీవరకు రద్దు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ-విశాఖపట్టణం మధ్య సిగ్నల్- లైటింగ్ అనుసంధానం పనులు జరుగుతున్న కారణంగా పలు రైళ్లు రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



రోహిణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 6: ఎస్వీయూ ఈసీఈ విభాగ పరిశోధకులు సంగీతం రోహిణి డాక్టరేట్ పొందారు. ల్యాండ్ యూజ్-ల్యాండ్ కవర్ డిటెక్షన్ అండ్ డెవెలప్‌మెంట్ ఆఫ్ ఆగ్రో-మెటియోరోలాజికల్ మోడల్ ఫర్ ఎస్టిమేషన్ ఆఫ్ క్రాప్ ఈల్డ్ ఇన్ ఏపీ యూజింగ్ ఏఐ అండ్ ఎంఎల్ టెక్నిక్స్ అంశంపై ప్రొఫెసర్ నారాయణరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తిరుపతి (గాంధీ రోడ్డు), ఆగస్టు 6: స్థానిక మెటర్నటీ ఆస్పత్రి ప్రాంగణంలో తిరుపతి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. ఎంఆర్‌పల్లె పంచాయతీ మాజీ వార్డుసభ్యుడు రామచంద్రారెడ్డి సతీమణి రెండవ వర్ధంతిని పురస్కరించుకుని 500మందికి అన్నదానం చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు ఎస్కే ముబారక్‌బాషా పేర్కొన్నారు. మాజీ అధ్యక్షుడు భీమినేని మునికృష్ణ నాయుడు, కార్యదర్శి గోకుల్‌కృష్ణ, కోశాధికారి మేరీ, ఏడీసీఎస్ డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్ నృత్య పోటీలకు ఆహ్వానం

తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 6: రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్ 34వ వార్షిక కళోత్సవాల్లో పాల్గొనదలచిన నృత్య కళాకారులు ముందస్తుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.ఎన్.రాజు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక మహతి కళాక్షేత్రంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులతోపాటు శ్రీవారి జ్ఞాపికలను అందజేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే కళాకారులు 93470 46608 నంబరుకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 6: తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలో వున్న విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడానికి బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు డివిజన్ ఈఈ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. నగర పరిధిలో వున్న తమ సబ్ డివిజన్ కేంద్రాలు, టీటీడీ పరిపాలనభవనం ప్రాంగణంలో వున్న విద్యుత్ సబ్‌డివిజన్(1)కార్యాలయం, శ్రీనివాసం ప్రాంగణంలో వున్న 2వ సబ్ డివిజన్ కార్యాలయం, డివిజన్ కేంద్ర కార్యాలయంలో వినియోగదారులు తమ సమస్యల వినతులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోండి

గూడూరు, ఆగస్టు 6: విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సెయింట్ మేరీస్ కళాశాల ప్రిన్సిపాల్ సిసిలియా అన్నారు. మంగళవారం జూనియర్ కళాశాలలో కళాశాల ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువను తెలియజెప్పేలా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని సమర్థవంతంగా నడుచుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నికల తరహాలో బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు నిర్వహించి ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్లను విద్యార్థినులు ఎన్నుకున్నారన్నారు. అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరుకు చేరిన టీడీపీ కార్యకర్త సైకిల్‌యాత్ర


రామచంద్రమురళితో టీడీపీ నాయకులు

గూడూరు, ఆగస్టు 6: ధర్మం గెలిచింది అనే నినాదంతో చిత్తూరు నుంచి విజయ వాడకు సైకిల్ యాత్ర చేపట్టిన టీడీపీ కార్యకర్త రామచంద్ర మురళి మంగళవారం గూడూరుకు చేరుకున్నారు. ఇక్కడి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ... సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో చిత్తూరుకు చెందిన టీడీపీ కార్యకర్త రామచంద్ర విజయవాడ వరకు సైకిల్ యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం రామచంద్రను సన్మానించారు. కార్యక్రమంలో వి.సునీల్, శివకుమార్, శివప్రసాద్, సాయిలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సుందరమ్మకు పూజలు

చిల్లకూరు, ఆగస్టు 6: స్థానిక దళితవాడలోని సుందరమ్మ అమ్మవారికి మంగళవారం ప్రత్యేకపూజలు జరిగాయి. ఈనెల 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న తిరునాళ్ల నేపథ్యంలో మూడో మంగళవారం అమ్మవారికి అంబలి పోసే కార్యక్రమం నిర్వహించారు. మహిళలు సామూహికంగా అంబలి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పర్యావరణ పరిరక్షణకు చెట్లను పరిరక్షిద్దాం


మొక్కలను అందిస్తున్న టీడీపీ నేతలు

చిల్లకూరు, ఆగస్టు 6: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అందుకోసం ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలను నాటి పరిరక్షించాలని టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ అన్నారు. మంగళవారం పట్టణంలోని దర్గా సమీపంలో పెళ్లకూరుకు చెందిన చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానికులకు మామిడి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ... మండలంలో ప్రతి ఇంటికి మామిడి మొక్కను అందించేందుకు ట్రస్ట్ చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ చాగణం గౌరీశంకర్, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కె.రామచంద్రారెడ్డి, పి.జానకిరామిరెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, సీతారామనాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలి

ఎమ్మెల్యే విజయశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నాయుడుపేట టౌన్, ఆగస్టు 6: అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ... తల్లిపాలు బిడ్డలకు శ్రేయస్కరమన్నారు. నియోజకవర్గంలో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు బాధ్యతగా పనిచేయడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ఇటీవల తనిఖీలు కూడా చేశామన్నారు. నియోజకవర్గ పరిధిలోని సెజ్‌ల్లో ఉన్న పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడి సీఎస్ఆర్ నిధులతో మారుమూల ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని కేర్‌పాలెం సమీపంలో ఉన్న నంద ఫంక్షన్ హాల్‌లో సూళ్లూరుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శారదాంబ ఆధ్వర్యంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఎమ్మెల్యే విజయశ్రీ పాల్గొన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీ కిషోర్, నాయకులు శ్రీనివాసులు, మాధవనాయుడు, మెస్ రమణయ్య, కె.మురళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

డక్కిలి, ఆగస్టు 6: పట్టణంలోని ఆధార్ కేంద్రాన్ని బుధవారం డివిజన్ పంచాయతీ విస్తరణ అధికారి వాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆధార్ నమోదుపై సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆధార్ సెంటర్‌ను నెలలో ఒక్కో సచివాలయానికి మార్చి ఆయా ప్రాంతాల్లో నూరుశాతం నమోదయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయితీ కార్యదర్శి, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

అదుపుతప్పి కాంక్రీట్ మిక్చర్ లారీ బోల్తా



నాయుడుపేట టౌన్, ఆగస్టు 6: మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో అదుపుతప్పి కాంక్రీట్ మిక్చర్ లారీ బోల్తా పడింది. మంగళవారం మేనకూరు నుంచి పండ్లూరుకు బయలుదేరిన లారీ మార్గమధ్యంలోని షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో ఎవరూ గాయపడలేదు.

దళితులపై వివక్ష తగదు

డక్కిలి, ఆగస్టు 6: దళితుల పట్ల కొంతమంది అధికారులు వివక్ష చూపుతున్నారని ఇది సరికాదని ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు జి.మునెయ్య అన్నారు. బుధవారం ఆయన డక్కిలి పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ... నియోజకవర్గంలో దళిత, గిరిజనుల పట్ల ఇటీవల కొంత మంది అధికారులు చాలా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డక్కిలి బాలయోగి బాలకల గురుకుల పాఠశాలలో ఇటీవల ఓ దళిత విద్యార్థి పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతో చనిపోతే ఇంత వరకు ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందలేదన్నారు. సైదాపురం మండలంలో వీరరాఘవయ్య అనే దళితుడు వైద్యశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందితే, ఈ సంఘటనపై జిల్లాస్థాయి అధికారులు నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. ఇదే ప్రాంతానికి చెందిన రాకేష్ అనే విద్యార్థి అగ్రకుల, పోలీసుల అనాలోచిత చర్యలతో మృతి చెందితే ఇప్పటివరకు చర్యల్లేవన్నారు. దళిత, గిరిజనుల పట్ల వివక్ష విడనాడక పోతే దళిత, గిరిజనులు ఏకమై ఉద్యమిస్తామని హెచ్చరించారు.

తిరుపతి రూరల్‌లో భారీ చోరీ

అన్నమయ్యనగర్‌లో

118 గ్రాముల బంగారు నగల అపహరణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 6: తిరుపతి రూరల్ లింగేశ్వరనగర్ పంచాయతీ అన్నమయ్యనగర్‌లో భారీ చోరీ జరిగింది. 118 గ్రాముల బంగారు నగలు అపహరించుకెళ్లారు. ఎంఆర్‌పల్లె ఎస్‌ఐ షేక్ షావలి తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్యనగర్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి రామయ్య కాపురముంటున్నాడు. మంగళవారం సాయంత్రం 4.10 గంటల ప్రాంతంతో పాఠశాలలో చదువుతున్న కుమారుడిని తీసుకురావడానికి అయన భార్య ఇంటికి తాళం వేశారు. ఆ తాళాన్ని బయట సోఫాలో పెట్టి వెళ్లింది. 20 నిమిషాల తర్వాత తిరిగొచ్చేసరికి తాళాలు తీసి ఉన్నాయి. లోపలకెళ్లి చూడగా బీరువాలోని 118 గ్రాముల బంగారు నగలు కనిపించలేదు. జరిగిన విషయాన్ని భర్తకు తెలియజేసింది. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాగా తెలిసిన వారే చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షం... విద్యుత్ సరఫరాకు అంతరాయం


సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై వర్షపు నీరు - గూడూరులో కురుస్తున్న వర్షం

సూళ్లూరుపేట, ఆగస్టు 6: సూళ్లూరుపేటలో కురిసిన భారీ వర్షానికి పట్టణంలో వీధులన్నీ జలమయమయ్యాయి. మంగళవారం ఉదయం నుంచి ఎండ కాయగా మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మారి కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు పట్టణంలో పలుచోట్ల చెట్టకొమ్మలు, ఫ్లెక్సీలు విద్యుత్ లైన్లపై కూలడంతో తీగలు తెగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సుమారు నాలుగు గంటల పైగా విద్యుత్‌కు అంతరాయం కలిగింది. ట్రాన్స్‌కో సిబ్బంది వెంటనే స్పందించి ఫ్లెక్సీలు, చెట్లను తొలిగించి సరఫరాను పునరుద్ధరించారు. భారీ వర్షం కురవడంతో జీఎన్‌టీ రోడ్డుపై వర్షపు నీరు నిలబడడంతో గుంతల రోడ్డులో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు.

తడలో...

తడ: పట్టణంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మోస్తరు ఎండ కాయగా మధ్యాహ్నం తరువాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. నల్లటి కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఉన్నట్టుండి ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో జాతీయ రహదారి తోపాటు సర్వీస్‌రోడ్లపై నీరు నిలిచిపోయింది. పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

గూడూరులో మోస్తరు వర్షం

గూడూరు అర్బన్: పట్టణంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, ఈదురుగాలులతో గంటకుపైగా వర్షం కురిసింది. ఆసుపత్రిరోడ్డు, ఐసీఎస్‌రోడ్డు, కోనేటిమిట్ట, శాంతినగర్, త్యాగరాజవీధి తదితర ప్రాంతాల్లో వాననీరు రోడ్లపై ప్రవహించడంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు ఇబ్బంది పడ్డారు. మూడు రోజులుగా ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది.

వైసీపీ నాయకుల చెర నుంచి భూములకు విముక్తి: పాశం


వాహనంనుంచి మాట్లాడుతున్న పాశం సునీల్ కుమార్

కోట, ఆగస్టు 6: వైసీపీ నాయకుల కబ్జాచేసిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని భూమిలేని పేదలకు పంచిపెడతామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చెప్పారు. కోట మండలం మద్దాలిలో రూ.29 లక్షలతో నిర్మించిన తాగునీటి పథకాన్ని మంగళవారం పాశం ప్రారంభించారు. అనంతరం జీపుపై ర్యాలీగా వెళ్లి మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు తయారుచేసిన పలు నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... మండలం వైసీపీ నాయకుల భూ కబ్జాకు చిరునామాగా నిలిచిందన్నారు. కేశవరం పంచాయతీలో వైసీపీ నాయకులు కబ్జాచేసిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని భూమిలేని పేదలకు పంచిపెడుతామన్నారు. అదే విధంగా మద్దాలిలో నిషేధంలో ఉన్న ప్రభుత్వ భూములకు మోక్షం కలిగించి స్థానిక ఎస్సీ, బీసీ, మైనార్టీలకు పంచుతామన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నేరవేరుస్తామన్నారు. వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని కలసికట్టుగా తిప్పికొడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.సర్వత్తమరెడ్డి, పార్టీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, దశరథరామిరెడ్డి, ఎన్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎన్.మోహన్‌రెడ్డి, చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ వ్యవహారంలో ఇరువర్గాల ఘర్షణ

బాలిక అన్న, మేనమామకు కత్తిపోట్లు


కత్తిపోట్లకు గురైన లోకేష్ - సురేష్‌ను విచారిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 6: ప్రేమ వ్యవహారంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. బాలిక అన్న, మేనమామ కత్తిపోట్లకు గురయ్యారు. తిరుపతి ఈస్ట్ డీఎస్పీ రవిమనోహరాచారి తెలిపిన వివరాల మేరకు.. స్థానిక రైల్వేకాలనీ సమీపంలోని సుందరయ్యనగర్‌లో నివాసముంటున్న బాలు అదే ప్రాంతంలోని ఓ బాలికను ప్రేమించడం మొదలుపెట్టాడు. తరచూ ఆ బాలికతో మాట్లాడటం చూసిన ఆమె పెద్దలు పలుమార్లు మందలించారు. దీనిపై గతంలో ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పట్లో పోలీసులు ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చి పంపారు. రెండ్రోజుల కిందట సుందరయ్యనగర్‌లో జాతర జరిగింది. ఈ సందర్భంగా బాలు మళ్లీ బాలిక వెంటపడటం మొదలుపెట్టాడు. మంగళవారం ఆమె అన్న లోకేష్ దీన్ని తట్టుకోలేక బాలు కుటుంబీకులతో గొడవపడ్డాడు. మాటామాటా పెరిగి రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. రాళ్లు, కర్రలతో కొట్టుకున్నారు. లోకేష్‌తోపాటు అతడి మేనమామ సురేష్‌పై బాలు వర్గీయులు కత్తితో దాడి చేశారు. లోకేష్‌కు కాలుపై, సురేష్‌కు కడుపు, కాలుపై కత్తిపోట్లు పడ్డాయి. బాధితులను పోలీసులు చికిత్స నిమిత్తం రుయాస్పత్రిలో చేర్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి: సీపీఎం

నాయుడుపేట, ఆగస్టు 6: ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు శివకవి ముకుంద డిమాండ్ చేశారు. నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం తహసీల్దారు గీతావాణికి ఈ మేరకు సీపీఎం అనుబంధ సంఘాల నాయకులతో కలసి వినతిపత్రం అందజేశారు. నాయుడుపేట మండలం పండ్లూరు పంచాయతీలోని సర్వే నెం.87, 89, 90లో ప్రభుత్వ భూమిని హైదరాబాదుకు చెందిన పారిశ్రామికవేత్తలు ఆక్రమించి అందులో ఫ్లైయాష్ బ్రిక్స్ తయరీ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఆ భూమిని భూములు లేని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, వరప్రసాద్, వంశీ, రమణయ్య తదితరులు ఉన్నారు.

భ్రూణ హత్యలను నివారించండి: ఆర్డీవో

సూళ్లూరుపేట, ఆగస్టు 6: లింగనిర్ధారణ చట్టాలను పటిష్ఠంగా అమలు చేసి భ్రూణ హత్యలను నివారించాలని ఆర్డీవో చంద్రముని ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో లింగ నిర్ధారణ చట్టం అమలుపై ఆర్డీవో ఆధ్వర్యంలో జిల్లా జిల్లాస్థాయి అడ్వైజర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆడ, మగ పిల్లలిద్దరూ సమానమేనని ఆడబిడ్డల పట్ల వివక్ష ఉండకూడదన్నారు. జిల్లాలో అన్ని స్కానింగ్ సెంటర్లను సంబంధిత అధికారులు తనిఖీచేయాలన్నారు. డిప్యూటీ ఈఎంహెచ్‌వో శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను వినియోగించుకోండి

జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు


మాట్లాడుతున్న జడ్జి కోటేశ్వరరావు

తిరుపతి (ఆటోనగర్), ఆగస్టు 6: నగర ప్రజలు స్వచ్ఛంద సేవా సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రులు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు సూచించారు. తిరుపతి రాస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం రాష్ట్రీయ సేవా సమితి, అమర ఆస్పత్రి యాజమాన్యం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత యోగా వైద్య శిబిరాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాన్య ప్రజలు ఆరోగ్య సమస్యలపై పరీక్షలు చేయించుకోవాలంటే అధికమొత్తంలో డబ్బు ఖర్చు అవుతోందన్నారు. ఉచిత వైద్య శిబిరాల్లో ఖరీదైన ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేసుకోవచ్చునని తెలిపారు. ప్రజలు ఆరోగ్యం పట్ల ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. రాస్‌ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు మాట్లాడుతూ తమ సంస్థ పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, పేద ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఈ శిబిరంలో రక్త పరీక్షలతో పాటు బీపీ, షుగర్, గుండె, గైనిక్, కిడ్నీ, ఈఎన్‌టీ, సాధారణ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా 500 మందిని పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. వికలాంగులకు ట్రైసైకిళ్ళు, వినికిడి యంత్రాలు అందజేశారు. డాక్టర్లు వెంకటశివక్రిష్ణ, భానుప్రకాష్, అశోక్‌రెడ్డి, శివపార్వతి, రాస్ డైరెక్టర్ వి.నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరుకు చెందిన సినీ అసిస్టెంట్ ఎడిటర్ మృతి

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సినీ అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేస్తున్న పుత్తూరుకు చెందిన మణిరత్నం రెడ్డి వడపళనిలో మృతి చెందారు. 'టౌన్‌బస్' అనే లాడ్జిలో బస చేసిన ఆయన వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం. మంగళవారం ఉదయం ఆయన మందులు కొనుగోలు చేసేందుకు లాడ్జి నుంచి బయటకు వచ్చారు. బయటకు రాగానే ఆయన స్పృహ తప్పి పడిపోయారు. దీనిని గమనించిన చుట్టుపక్కల వారు 108 అంబులెన్సును రప్పించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు తేలింది. ఆయన మృతదేహాన్ని కేకే నగర్ ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'మండల పరిషత్ కార్యాలయంలో వైసీపీ నాయకుల దందా'

వాకాడు, ఆగస్టు 6 : మండల పరిషత్ కార్యాలయంలో వైసీపీ నాయకులు సమావేశాలు ఏర్పాటు చేస్తూ అధికారులను భయాందోళనలకు గురిచేస్తున్నారని తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి కె.దయాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న వైసీపీ నాయకులు అధికార యంత్రాంగాన్ని భయాందోళనలకు గురి చేసి భూ ఆక్రమణలకు పాల్పడ్డారన్నారు. ఇసుక, మట్టి దోచుకున్నారన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీని గద్దెదింపడంతో ఓటమిని జీర్ణించుకోలేక మండల పరిషత్ కార్యాలయంలోకి వెళ్లి అధికార యంత్రాంగాన్ని భయపెడుతూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. వైసీపీ నాయకుల అరాచకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

తెలంగాణ బాలుడి కథ సుఖాంతం

మీర్‌పేటలో మిస్సైన విద్యార్థిని తిరుపతిలో గుర్తించిన పోలీసులు


పోలీసుల సంరక్షణలో ఉన్న మహీధర రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 6: తెలంగాణకు చెందిన బాలుడు మహీధర రెడ్డి ఆచూకీ తిరుపతిలో లభ్యమైంది. మంగళవారం వివరాలను డీఎస్పీ రవిమనోహరాచారి మీడియాకు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలోని మీర్‌పేటకు చెందిన కవిత, మధుసూధనరెడ్డిల కుమారుడు మహీధర రెడ్డి రోజులాగా ఆగస్టు 4న సాయంత్రం తన అన్న మౌనేందర్ రెడ్డితో కలసి ట్యూషన్‌కు వెళ్లాడు. ట్యూషన్ అయ్యాక అన్న ఇంటికి వెళ్లాడు. మహీధర రెడ్డి మాత్రం ఇంటికి రాలేదు. ఎంతకీ రాకపోవడంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించారు. ఫలితం లేకపోవడంతో మీర్‌పేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే మహీధర రెడ్డి ట్యూషన్ నుంచి ఇంటికి వెళ్లకుండా తాను దాచుకున్న రూ.1000లతో హైదరాబాదు నుంచి ఆదివారం రాత్రి రైలెక్కి సోమవారం తిరుపతికి వచ్చాడు. తర్వాత తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నాడు. తిరిగి బస్సులో బయల్దేరి తిరుపతి శ్రీహరి బస్టాండు వద్దకు చేరుకున్నాడు. ఇక్కడ బిక్కు, బిక్కుమంటూ తచ్చాడుతున్న బాలుడిని బస్టాండులోని అవుట్ పోస్టు పోలీసులు చేరదీసి విచారించారు. తల్లిదండ్రుల పేర్లు, అడ్రస్ చెప్పడంతో వెంటనే ఈస్ట్ పోలీసు స్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. జరిగిన విషయాన్ని బాలుడు తల్లి దండ్రులకు తెలియచేసి తిరుపతికి రమ్మని చెప్పారు.

బాలల సంరక్షణ కేంద్రానికి తరలింపు: తిరుపతి ఈస్ట్ పోలీసుల వద్ద ఉన్న మహీధర రెడ్డిని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో మంగళవారం సాయంత్రం డీఎస్పీ పర్యవేక్షణలో పోలీసులు బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. బాలుడిని గుర్తించిన తిరుపతి ఆర్టీసీ బస్టాండు అవుట్ పోస్టు పోలీసులను పలువురు అభినందించారు.

గిరిజన అభ్యర్థులకు జాబ్‌మేళా

12న శ్రీకాళహస్తి ఎస్‌వీఏ కళాశాలలో ఎంపికలు

తిరుపతి(విద్య), ఆగస్టు6:టెన్త్,ఇంటర్ ఉత్తీర్ణులైన గిరిజన అభ్యర్థులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌కు చెందిన ఎస్కే సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈనెల 12న ప్రత్యేకంగా గిరిజన అభ్యర్థులకోసం జాబ్‌మేళాను శ్రీకాళహస్తి ఎస్‌వీఏ మెన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనుంది. ఇంగ్లిష్ చదవడం, రాయడం తెలిసి ఉండాలి. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్, చెన్నై ప్రాంతాల్లో అమెజాన్‌లో పిక్కింగ్, ప్యాకింగ్, స్కానింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ వంటి ఉద్యోగాలు చేయాల్సి ఉంటుంది. వారానికి ఐదు రోజులు పగలు, రాత్రి షిఫ్ట్ విధానంలో నెలకు రూ.17,000 జీతం ఉంటుంది. పీఎఫ్, ఈఎస్ఐ తోపాటు అదనపు పనికి అదనపు వేతనం ఉంటుంది. మరిన్ని వివరాలకు 94935 24121, 84650 43892 నెంబర్లలో సంప్రదించవచ్చు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ 11వరకు రద్దు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 6:కడప-తిరుపతి-విశాఖపట్టణంల మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ మంగళవారం నుంచి ఈనెల 11వ తేదీవరకు రద్దు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ-విశాఖపట్టణం మధ్య సిగ్నల్- లైటింగ్ అనుసంధానం పనులు జరుగుతున్న కారణంగా పలు రైళ్లు రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ కోసం కాల్ సెంటర్

తడ, ఆగస్టు 6: గ్రామాల్లో సమస్యల ఫిర్యాదు కోసం కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని ఎంపీడీవో విజయకుమార్ తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను కాల్‌సెంటర్ ఫోన్ నెం.8838410059కు కానీ, వాటాప్స్ నెం.9573836731కు ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు.

తహసీల్దార్లు పారదర్శకంగా పనిచేయాలి

ఎమ్మెల్యే కురుగొండ్ల


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న తహసీల్దార్

డక్కిలి, ఆగస్టు 6: కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు రెవెన్యూ సమస్యల పరిష్కారంలో పారదర్శకంగా పనిచేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచించారు. బుధవారం డక్కిలికి బదిలీపై వచ్చిన తహసీల్దార్ శ్రీనివాసులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కురుగొండ్ల మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వంలో తహసీల్దార్ల అండతో భూ ఆక్రమణలు, అడ్డగోలుగా పట్టాల మంజూరు జరిగాయన్నారు. పనుల కోసం కార్యాలయాలకు వచ్చే అర్జీదారులను రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సకాలంలో పనులు చేసి పెట్టాలన్నారు. నియోజకవర్గంలో పేరుకుపోయిన రెవెన్యూ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు.

నేడు కురుగొండ్ల విజయోత్సవ సభ

డక్కిలి, ఆగస్టు 6: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వగ్రామం పాతనాలపాడులో బుధవారం విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రామకృష్ణ తమ గ్రామ నివాసి కావడం తామకు గర్వకారణమన్నారు. వెంకటగిరి నుంచి ఆయన మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి చరిత్ర సృష్టించారని చెప్పారు.

పంట కాలువ పూడికతీత పనుల ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న విజయశ్రీ తదితరులు

నాయుడుపేట, ఆగస్టు 6: పట్టణ నడిబొడ్డున ప్రవహిస్తున్న విన్నమాల పంటకాలువ మురికి కూపంలా మారిందని, దాని పూడికతీతతో పరిసరాలు శుభ్రంగా మారుతాయని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. రూ.38 లక్షలతో నాయుడుపేట స్వర్ణముఖినది బీడీకాలనీ నుంచి ప్రారంభమయ్యే విన్నమాల పంటకాలువ పూడికతీత పనులను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపికతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సహకారంతో పంటకాలువ పూడికతీత పనులను చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా విన్నమాల, పెరికలంపాటికండ్రిగ, నరసారెడ్డికండ్రిగ ప్రాంతాల రైతులకు సాగునీరు అందుతుందన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ రఫీ, నాయకులు పార్థసారధి, నెలవల రాజేష్, బీజేపీ నాయకులు కృష్ణయ్య, మాల్యాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించండి


న్యాయమూర్తికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గూడూరు, ఆగస్టు 6: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానాబేగం సూచించారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో ఏరియా ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో న్యాయవాదులకు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనారోగ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించు కోవడంతో పాటు వ్యాయామం తప్పనిసరి అన్నారు. న్యాయవాదులకు ఏరియా ఆసుపత్రి వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ మోహన, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

త్రివిధ దళాలలో ప్రవేశాలపై అవగాహన


సూచనలిస్తున్న కమాండర్ పరీక్షిత్

కోట, ఆగస్టు 6: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం త్రివిధ దళాలలో ప్రవేశాలకు సంబంధించి అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సును కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ప్రారంభించారు. తమిళనాడు రాష్ట్రం అరక్కోణం బేస్ క్యాంప్‌కు చెందిన ఇండియన్ నేవి అధికారి లెఫ్టినెంట్ కమాండర్ పరీక్షిత్‌రావు పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలోని ఎన్‌సీసీ క్యాడెట్లకు త్రివిధ దళాలలోని జీవన విధానాన్ని, ఇండియన్ నేవి ప్రాముఖ్యతను, అవకాశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, మాధవయ్య, శోభారాణి, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షార్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు


షార్ డైరెక్టర్ నుంచి బహుమతులు అందుకున్న విద్యార్థులు

సూళ్లూరుపేట, ఆగస్టు 6: జాతీయ అంతరిక్ష దినోత్సవాల్లో భాగంగా మంగళవారం షార్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ నెల 23న అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఇస్రో, షార్ ఆధ్వర్యంలో దేశంలో వివిధ ప్రాంతాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాలు వాటి ఉపయోగాలు తదితర అంశాలపై షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పరిసర ప్రాంతాల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. సూళ్లూరుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.హిమహంసిని, కె.సురంజన, ఎన్.యశశ్విని, ఇంటర్‌కు చెందిన అమృత లక్ష్మిలకు ప్రథమశ్రేణిలో నిలిచి షార్ డైరెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

పాఠశాలల మూసివేత తగదు



అంజూరు పాఠశాలలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కేవీబీపురం, ఆగస్టు 6: పాఠశాలలను సర్దుబాటు పేరుతో మూసివేయడం తగదని ఎస్టీయూ నాయకుడు నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం మండలంలోని అంజూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యా యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిమంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలను మూసివేయడం సమంజసం కాదన్నారు. 22వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ముఖ్యంగా సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతతో విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయన్నారు. జీవో 117ను వెంటనే రద్దు చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే గత ప్రభుత్వం నియమించిన వేతన సవరణ కమిటీ చైర్మన్ మన్మోహన్‌సింగ్ రాజీనామా చేసినా వెంటనే కొత్త చైర్మన్‌ను నియమించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురళీధర్, కన్వీనర్ సుధాకర్, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ హరికృష్ణ, సునీల్, రవి, పురంధర్, చంద్ర, దాము పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 6: పట్టణంలోని జయరామరావువీధిలో మురుగు కాలువలో పూడికతీత పనులను పురపాలక సంఘ కమిషనర్ రమేష్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని గొడ్డేరు, ఓటేరు, కన్నలి, నాగులగుంట కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగిస్తామన్నారు. ప్రజలు కాలవల్లో చెత్తను వేయకుండా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలకసంఘ అధికారులు లలిత, శైలజ, శ్రీకాంత్, దినకర్, సచివాలయ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించండి



ఆరోగ్యకేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

వరదయ్యపాళెం, ఆగస్టు 6: ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు వాణి, చంద్రయ్య డిమాండ్ చేశారు. మంగళవారం వరదయ్యపాళెం, చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు కోరికల సాధన దినం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆశా వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించకుండా స్కీం వర్కర్ల పేరుతో తమ కష్టాన్ని దోచుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు.

వేడుకగా కాలభైరవస్వామి ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి, ఆగస్టు 6: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు మేళ తాళాల మధ్య అభిషేకాలు ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. ఉత్సవమూర్తిని మహాద్వారం నుంచి విజయ స్థూపం వరకు వెళ్లి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువుతీర్చారు.

బెల్ట్‌షాపుపై ఎస్‌ఈబీ దాడులు

సత్యవేడు, ఆగస్టు 6: శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో అక్రమ మద్యం అమ్మకాలపై ఎస్‌ఈబీ అధికారులు దాడులు జరిపారు. రామచంద్రాపురంలో ఒక బెల్ట్‌షాపుపై దాడి చేసి ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడు మస్తాన్‌ను అదుపులో తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం స్టేషన్ బెయిల్‌పై నిందితుడిని విడిచి పెట్టినట్లు సమాచారం.

నేడు గంగమ్మ జాతర చాటింపు

రేణిగుంట, ఆగస్టు 6: రేణిగుంట పట్టణంలో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న గంగమ్మ జాతరకు బుధవారం చాటింపు వేయనున్నారు. మంగళవారం ఆలయంలో చలువ పందిళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మకర్తల మండలి సభ్యులు మాట్లాడుతూ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్త సోలా మల్లికార్జునరెడ్డి, సభ్యులు జ్యోతి నారాయణ, చిన్నబాబు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా కోటేశ్వరరావు



ఏర్పేడు, ఆగస్టు 5: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం విజయవాడలో జరిగింది. ఆ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా ఏర్పేడు మండలం కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన తోటకూర కోటేశ్వరరావు ఎన్నికయ్యారు.

విద్యార్థులకు వాలీబాల్ కిట్ అందజేత

శ్రీకాళహస్తి, ఆగస్టు 6: శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం సంఘ సేవకుడు డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు సేవ చేయడంలో ఉన్న సంతృప్తి ఎందులోనూ లేదన్నారు. ఉపాధ్యాయులు ఆయనను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

సత్యవేడు, ఆగస్టు 6: మండలంలోని దళవాయి అగ్రహారం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మెకానిక్ బాలాజీ (43)మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం గ్రామానికి చేరుకుని బాలాజీ భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జడేరిలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నేత మునస్వామి యాదవ్ ఇంటికి చేరుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా కన్నావరంలో జనసేన మండల కార్యదర్శి జ్యోతీశ్వర్ ఇంటికి చేరుకుని ఇటీవల మృతి చెందిన అతని తల్లి ధనలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 6: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పదహారు కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సింధూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు.

ఇసుక డంపు తనిఖీ

పిచ్చాటూరు, ఆగస్టు 6: మండలంలోని అడవి కొడియంబేడు ఇసుక డంపును తహసీల్దార్ రమేష్ బాబు మంగళవారం తనిఖీ చేశారు. స్థానికులకు వినియోగార్థం మాత్రమే ఇసుకను పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తరలింపులో ఎలాంటి అవకతవకలు జరిగిన ఉపేక్షించే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు కీళపూడి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.డీటీ వెంకటేశ్వర్లు, వీఆర్వో నాగభూషణం పాల్గొన్నారు.

టీడీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ



ఏసు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, ఆగస్టు 6: పిచ్చాటూరు ఇందిరా నగర్‌కు చెందిన టీడీపీ నేత ఏసు మాతృమూర్తి కృష్ణమ్మ సోమవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం పిచ్చాటూరు ఇందిరానగర్‌కు చేరుకుని ఏసు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యాసామగ్రి పంపిణీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 6: పట్టణంలోని బీసీ బాలికల వసతిగృహంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, బాక్సులను కన్నలి ప్రతాప్‌రెడ్డి పంపిణీ చేశారు. వసతిగృహ అధికారులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారే కేసులు పెట్టడం దారుణం

రేణిగుంట, ఆగస్టు 6: దాడి చేసిన వారే తమపై కేసులు బనాయించడం దారుణమని రాష్ట్ర క్రిస్టియన్ సెల్ నాయకుడు అరుళ్ అరసు ఖండించారు. మంగళవారం జ్యోతినగర్‌లోని చర్చిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ సాయంత్రం ఏర్పేడు మండలంలోని మునగలపాళెంలో క్రీస్తు సువార్త బృందం కరపత్రాలు పంచుతుండగా అదే గ్రామానికి చెందిన వెంకటరామానాయుడు తమ వద్ద ఉన్న కరపత్రాలు లాక్కుని చించి వేసి దుర్భాషలాడారని చెప్పారు. అక్కడున్న మరో వ్యక్తిపై దాడి చేసి కుల దూషణకు దిగారని, ఈ విషయమై ఏర్పేడు సీఐకి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని తెలిపారు. అయితే దాడి చేసిన వ్యక్తి, అతని భార్య తమ బృందానికి చెందిన నలుగురిపై తప్పుడు కేసు పెట్టించడాన్ని ఖండిస్తున్నామన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా మతమార్పిడి జరుగుతోందని బీజేపీ నాయకులు ఏర్పేడు పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. సమావేశంలో పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు రాజేంద్రన్, దేవిడ్ కరుణాకర్, జైపాల్, పాల్‌రాజ్, డేనియల్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

తహసీల్దారుకు శుభాకాంక్షలు



తహసీల్దారు రాజశేఖర్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

వరదయ్యపాళెం, ఆగస్టు 6: వరదయ్యపాళెం తహసీల్దారుగా రాజశేఖర్‌ను ఎంపీడీవో ప్రసాద్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మెరుగుపడని ఏరియా ఆస్పత్రి నిర్వహణ

పట్టించుకోని అధికారులు, పాలకులు



ప్రభుత్వాస్పత్రిలో చెత్తకుప్ప వద్ద పందులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 6: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నిర్వహణ తీరు అధ్వానంగా ఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆస్పత్రి నిర్వహణ పూర్తిగా గాడి తప్పింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావస్తున్నా అధికారుల్లో ఇంకా అలసత్వం వీడలేదు. కొత్త పాలకులు సైతం ఆస్పత్రి ప్రక్షాళనపై దృష్టి సారించకపోవడంతో అధికారులు వైసీపీ మత్తులోనే జోగుతున్నారు. ఇక వైద్య సేవలు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయని రోగులు వాపోతున్నారు. ఒక్క జూలై నెలలోనే 50 మంది గర్భిణులను ఇక్కడ కాన్పు చేయకుండా తిరుపతికి రెఫర్ చేసి చేతులు దులుపుకున్నారు. అత్యవసర కాన్పులు కూడా ఆస్పత్రిలో చేయడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇక ఆస్పత్రి ప్రాంగణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. పందులు, పిచ్చికుక్కలు సంచరిస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అధ్వాన పరిస్థితులపై దృష్టి సారించి మెరుగుపరచాల్సిన అవసరం ఉంది.

విద్యారంగ సమస్యలను పరిష్కరించండి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 6: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు తిరుపతిలోని కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. రాష్ట్రంలో హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించిమౌలిక వసతులు కల్పించాలని, కాస్మోటిక్, మెస్ ఛార్జీలను పెంచాలని కోరారు. అనంతరం డీఆర్వో పెంచలకిషోర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కోళిలి మునిచందు, బాబి, ప్రదీప్, ముకేష్, దినేష్, అభి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఏర్పేడు, ఆగస్టు 6: రాష్ట్రీయ సేవా సమితి (రాస్), టాటా ట్రస్టు సౌజన్యంతో ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరాన్ని మంగళవారం చిందేపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ మాట్లాడుతూ పనిభారం, ఒత్తిడితో ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ఆరోగ్యం బాగుంటేనే జీవితం ఆనందంగా ఉంటుందన్నారు. డాక్టర్ వెంకయ్యబాబు మాట్లాడుతూ గుండె జబ్బుల తరువాత అత్యధికంగా జనాన్ని ఇబ్బంది పెడుతున్న జబ్బు క్యాన్సర్ అని అన్నారు. ఈ మహమ్మారిని ఆదిలోనే గుర్తించకపోతే ఎన్నో సమస్యలకు గురికావాల్సి వస్తుందన్నారు. వైద్యశిబిరంలో పాల్గొన్న మహిళలు, పురుషులకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్టు డాక్టర్ వెంకయ్యబాబు బృందం, హేమంత్‌కుమార్, రెడ్డికుమారి, మెహతాజ్, మహేంద్ర, రాస్ సిబ్బంది వినోద్, జయలలిత, రాజశేఖర్, పొదుపు సంఘాల సభ్యులు, లీడర్లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

సత్యవేడు, ఆగస్టు 6: పాడి రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తమారికుప్పంలో మంగళవారం వెటర్నరీ డాక్టర్ దయాకర్ ఆధ్వర్యంలో పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స నిర్వహించి, మందులను పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడి రైతుల అభివృద్ధికోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ఇప్పటికే మినీ గోకులాలకు అర్హులైన పాడి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అమాసరెడ్డి, షణ్ముగం పాల్గొన్నారు.

నాసిరకం పనులపై డీఎల్‌పీవో విచారణ

రేణిగుంట, ఆగస్టు 6: రేణిగుంట పంచాయతీ పరిధిలో తెలుగుగంగ పైపులైన్ల ఏర్పాటులో అవినీతి జరిగిందని, నాసిరకం పనులు చేసి బిల్లులు కాజేశారని ప్రజాపరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో మంగళవారం రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో శ్రీకాళహస్తి డీఎల్‌పీవో ప్రభురెడ్డి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేణిగుంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్, పంచాయతీ కార్యాలయంలోని ప్రైవేటు ఉద్యోగి సుబ్బరాజు తెలుగుగంగ పైపులైన్ల నిర్మాణంలో నాసిరకం పనులు చేసి నిధులు స్వాహా చేశారని ఫిర్యాదు రావడంతో విచారణ చేపట్టామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్ విచారణకు రాలేదని, ఫోన్ చేయగా డీపీవోకు లిఖిత పూర్వకంగా ఫైల్స్ పంపించినట్లు చెప్పారన్నారు. అలాగే పాంచాలినగర్‌లో ఉన్న సుబ్బరాజు బోరు జాగాలో ఇంటి నిర్మాణంపై లీగల్ నోటీసు ఇవ్వాలని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వెంకటరత్నమ్మకు ఆదేశాలు జారీ చేశారు.

సీనియర్లు, జూనియర్లు సోదరభావంతో మెలగాలి



సదస్సులో మాట్లాడుతున్న జయరాం నాయక్

నారాయణవనం, ఆగస్టు 6: కళాశాలలో సీనియర్స్, జూనియర్స్ విద్యార్థులు సోదరభావంతో మెలగాలని ఏఎస్ఐ జయరాం నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన శిక్షలు తప్పవని గుర్తు చేశారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి, జనార్దనరాజు మాట్లాడుతూ కళాశాలలో ఎవరైనా ర్యాగింగ్ పాల్పడితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులు తమ లక్ష్య సాధనపై దృష్టి పెట్టి, తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్వరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 6: డెంగ్యూ, మలేరియా జ్వరాల పట్ల ప్రజలకు ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దివాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక గ్రామాల్లో అధికంగా క్వారీలు, క్రషర్‌లు ఉండడంతో దోమ కాటు ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు వస్తాయన్నారు. నాలుగు రోజులు పాటు నీరు నిల్వవున్న చోట దోమలు ఉత్పత్తి చెందుతాయన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాస్టర్ ట్రైనర్స్‌గా శ్రీకాళహస్తి అధ్యాపకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 6: ఏపీసీసీఈ యునెస్కో, ఎంజీఐఈపీ సంయుక్తంగా డిగ్రీ విద్యార్థులకు సోషల్ డెవలప్‌మెంట్ స్కిల్ పేపర్-1 సర్టిఫికెట్ కోర్సుపై సీక్-సెల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తోంది. చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాలలో ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తిలోని ఎస్పీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల అధ్యాపకులు సంక్రాంతి రాజేంద్రుడు, వి.మునెయ్య మాస్టర్ ట్రైనర్స్‌గా ఎంపికయ్యారు. వీరు తిరుపతి, చిత్తూరు జిల్లా నుంచి ఎంపికైన డిగ్రీ కళాశాల అధ్యాపకులకు శిక్షణ ఇవ్వనున్నారు. వీరిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీలత, అధ్యాపకులు అభినందించారు.

గాజులపెళ్లూరులో పోలేరమ్మ జాతర



అంబళ్లు తీసుకెళ్తున్న మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 6: మండలంలోని గాజులపెళ్లూరులో గ్రామ దేవత పోలేరమ్మ జాతరను మంగళవారం వైభవంగా ప్రారంభించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించారు. మహిళలు, భక్తులు అంబళ్లు తీసుకుని ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయంలో విగ్రహాలకు పూజలు చేశారు. గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి అంబుళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. 60 సంవత్సరాల తరువాత పోలేరమ్మ జాతర నిర్వహిస్తుండడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 6: వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం ఆయన వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన ధృవపత్రాలను సకాలంలో అందజేయాలని, ప్రజలు కార్యాలయం చుట్టూ తిరగకుండా గ్రామాల్లోనే పరిష్కరించాలన్నారు. భూ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీటీ చంద్రబాబు, సీనియర్ సహాయకుడు నాగరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

నృత్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలుగా నిలిచిన నృత్యకారులు

పుత్తూరు టౌన్, ఆగస్టు 6: పలమనేరులో కళా తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సంగీత, నృత్య పోటీలు నిర్వహించారు. ఇందులో పుత్తూరుకు చెందిన స్కైడ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఫోక్, వెస్ట్రన్, క్లాసికల్ డ్యాన్స్‌లలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. మంగళవారం స్కై అకాడమీ మాస్టర్లు, నృత్యాకారులకు సినీ నిర్మాత, డైరెక్టర్ ఉమాశంకర్ చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్కై అకాడమీ డ్యాన్స్ మాస్టర్ మధుసూదన్, లత, నృత్య కళాకారులు పాల్గొన్నారు.